నివాళి

పద్మశ్రీ అందుకున్న రైతుబిడ్డ

- భాషా శాస్త్రవేత్త బండి రామకృష్ణారెడ్డి సేవలను గుర్తు చేసుకుంటున్న విద్యావేత్తలు
- హైదరాబాదులో కన్నుమూసిన వెదురుకుప్పం ప్రాంత వాసి
- ద్రావిడ వర్సిటీ తొలి రిజిస్ట్రార్‌గా సేవలు

వెదురుకుప్పం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదులో బుధవారం కన్నుమూసిన వెదురుకుప్పం ప్రాంతానికి చెందిన భాషా శాస్త్రవేత్త పద్మశ్రీ బండి రామకృష్ణారెడ్డి సేవలను పలువురు గుర్తు చేసుకుంటున్నారు. కుప్పం ద్రావిడ విశ్వవిద్యాలయం తొలి రిజిస్ట్రార్‌గానూ చేసిన ఆచార్య బండి రామకృష్ణారెడ్డి(84) కొంత కాలంగా అనారోగ్యంతో హైదరాబాదులోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అక్కడే ఆఖరి శ్వాస విడిచారు. ఈయన స్వస్థలం వెదురుకుప్పం మండలం తిరుమలయ్యపల్లె పంచాయతీలోని రెంటాలచేను. వీరిది వ్యవసాయ కుటుంబం. పల్లెలో ప్రాథమిక బడికూడా లేకపోవడంతో కాపుమొండివెంగనపల్లెలో అమ్మమ్మ ఇంట్లో ఉంటూ వెదురుకుప్పంలో పదో తరగతి వరకు చదువుకున్నారు. కార్వేటినగరంలో ఇంటర్ చదువుతున్న రోజుల్లో గణిత అధ్యాపకుడు కార్వేటినగరం నివాసి డాక్టర్ అరుణాలం ప్రోత్సాహం ఈయనకు దారి చూపింది. తిరుపతి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎంఏ(హిందీ) చదివారు. పుణెలోని డెక్కన్ కాలేజీలో ఎంఏ భాషా శాస్త్రం చదివారు. ఆ తర్వాత కొన్ని సంవత్సరాలు అన్నామలై విశ్వవిద్యాలయంలోనూ, సీఐఐఎల్ (మైసూర్)లోనూ పనిచేశారు. అనంతరం కామన్వెల్త్ ఫెలోషిప్‌పై యూకే వెళ్లి ఎడిన్‌బర్గ్ విశ్వవిద్యాలయంలో అండర్సన్ కేస్ గ్రామర్‌పై పీహెచ్‌డీ చేశారు. చంద్రగిరి మండలం రంగంపేటకు చెందిన కె.నాగమ్మతో వివాహం జరిగింది. ఆమె కూడా ప్రొఫెసర్‌గా చేశారు. 2008లో ఆమె చనిపోయారు. 1977లో ఉస్మానియా యూనివర్సిటీ భాషా శాస్త్ర విభాగంలో లెక్చరర్‌గా చేరి, తరువాత ప్రొఫెసర్ అయ్యారు. 1990లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా చేరి రిజిస్ట్రార్‌గానూ పనిచేశారు. కుప్పంలోని ద్రావిడ విశ్వవిద్యాలయం స్థాపించినపుడు తొలి రిజిస్ట్రార్‌గా సేవలను అందించారు. ఆసమయంలో గురువు అరుణాచలం ఈయూనివర్సిటీ వీసీగా ఉన్నారు. బండి రామకృష్ణారెడ్డి అనేక గిరిజన భాషలపై విశేష కృషి చేశారు. 'ఇంది-ఆవే'భాషకు లిపి తయారు చేశారు. భారత ప్రభుత్వం నుంచి ప్రతిష్ఠాత్మక పద్మశ్రీని రాష్ట్రపతిచేతుల మీదుగా అందుకున్నారు. ఈయన మేనల్లుడు డాక్టర్ ఎన్.ఈశ్వరరెడ్డి యోగివేమన విశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో ఆచార్యుడిగా ఉన్నారు. స్వస్థలంవీడి ఈ కుటుంబం దశాబ్దాల కిందటే వెళ్లిపోయినా వెదురుకుప్పం ప్రాంతం లో వీరికి బంధువర్గం ఉంది. వీరి మృతి పట్ల ఎస్వీయూ తెలుగు విశ్రాంతాచార్యులు పేట శ్రీనివాసులు రెడ్డి తదితరులు సంతాపం తెలిపారు.





వెదురుకుప్పం మండలం రెంటాలచేనులో రామకృష్ణారెడ్డి ఇల్లు

ద్రావిడ వర్సిటీకి రామకృష్ణారెడ్డి సేవలు ఎనలేనివి



రామకృష్ణారెడ్డి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న దొరస్వామి తదితరులు

గుడుపల్లె, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ద్రావిడ విశ్వవిద్యాలయానికి తొలి రిజిస్ట్రార్‌గా పనిచేసిన పద్మశ్రీ రామకృష్ణారెడ్డి సేవలు ఎనలేనివని ఇన్‌చార్జి వీసీ ఆచార్య దొరస్వామి తెలిపారు. గురువారం ద్రావిడ వర్సిటీలోని ఎన్టీఆర్ విగ్రహం ఎదుట రామకృష్ణారెడ్డి సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి ఇన్‌చార్జి వీసీతోపాటు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్ కుమార్, డీన్ ఆచార్య శ్యామల, అధ్యాపకులు, ఉద్యోగులు పూల మాల వేసి, నివాళి అర్పించారు. పలువురు ఉద్యోగులు ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ అధ్యాపకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ముదురుతున్న ఎండలు

ఇబ్బంది పడుతున్న జనం



బోసిపోయిన చిత్తూరు ఫ్లైఓవర్ పరిసరాలు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకూ ఎండలు ముదురుతున్నాయి. పెరుగుతున్న ఎండలతో జనం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గురువారం అత్యధికంగా నగరిలో 41.2, అత్యల్పంగా బైరెడ్డిపల్లెలో 35.3 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత నమోదైంది. మండలాలవారీగా.. శ్రీరంగరాజపురం, గుడిపాల, చిత్తూరు మండలాల్లో 40.7, తవణంపల్లెలో 40.3, సోమలలో 39.4, బంగారుపాళ్యంలో 39.1, గంగాధరనెల్లూరులో 38.9, గంగవరం, పెద్దపంజాణి, పులిచెర్ల, రొంపిచెర్ల, సదుం, యాదమరి మండలాల్లో 38.6, చౌడేపల్లె, ఐరాల, పెనుమూరు, పూతలపట్టు, వెదురుకుప్పం, నింద్ర, పాలసముద్రం మండలాల్లో 38.2, గుడుపల్లె, శాంతిపురం మండలాల్లో 37.6, కార్వేటినగరంలో 37.4, పలమనేరులో 36.5, పుంగనూరులో 35.8, రామకుప్పంలో 35.7, కుప్పంలో 35.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

విద్యార్థుల సంఖ్య తగ్గకుండా చూసుకోవాలి

లేదంటే అధ్యాపకుల పోస్టులూ గల్లంతవుతాయి! - నూతన డీఐఈవో శ్రీనివాసులు



చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గితే ఆ మేరకు అధ్యాపక పోస్టులు గల్లంతయ్యే ప్రమాదం ఉందని నూతన జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి (డీఐఈవో) శ్రీనివాసులు తెలిపారు. గురువారం డీఐఈవోగా బాధ్యతలు చేపట్టిన ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల బలోపేతానికి కృషి చేస్తామన్నారు. ప్రస్తుతం మే నెలాఖరు వరకు వేసవి సెలవులు ఉన్నా.. సప్లిమెంటరీ పరీక్షల నేపథ్యంలో ఫెయిలైన విద్యార్థులకు కళాశాలల్లో రెమిడియల్ తరగతులు ఉంటాయని స్పష్టం చేశారు. కళాశాలల బలోపేతంలో భాగంగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నట్లు చెప్పారు. కాగా, డీఐఈవోను ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్యాలు కలిసి అభినందనలు తెలిపాయి.

కుప్పంలో క్యాంపు రాజకీయాలు!

టీడీపీలో తేలని చైర్మన్‌గిరీ

- వైసీపీలో చక్రం తిప్పుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి

కుప్పంలో క్యాంపు రాజకీయాలు మొదలయ్యాయి. కుప్పం మున్సిపల్ చైర్మన్ గిరీకోసం అధికార, ప్రతిపక్ష పార్టీలు ఎత్తులు పైఎత్తులకు తలపడడం ప్రారంభించాయి. కుప్పం మున్సిపల్ చైర్మన్ ఎన్నికలు ఈనెల 28వ తేదీన జరగాలని నిర్ణయిస్తూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో రాజకీయాలు రసవత్తరంగా మారాయి.

\- కుప్పం, ఆంధ్రజ్యోతి



వైసీపీనుంచి టీడీపీ తీర్థం పుచ్చుకున్న నలుగురు కౌన్సిలర్లను కలుపుకుని అధికార పార్టీకి మొత్తం 10 మంది కౌన్సిలర్లు, వైసీపీకి 14 మంది కౌన్సిలర్లు ఉన్నారు. మున్సిపల్ చైర్మన్ పదవితోపాటు కౌన్సిలర్ పదవికి కూడా డాక్టర్ సుధీర్ రాజీనామా చేశాక 16వ వార్డు ఖాళీగానే ఉంది. దీనికి ఇప్పట్లో ఎన్నికలు ప్రకటించక పోవడంతో ప్రస్తుతానికి 24 మంది మాత్రమే కౌన్సిల్‌లో ఉన్నారు. చైర్మన్ ఎన్నికల్లో ఈ 24 మందితోపాటు టీడీపీ, వైసీపీ ఎమ్మెల్సీలు కంచర్ల శ్రీకాంత్, భరత్‌లకు ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఓటు హక్కు ఉంటుంది. స్థానిక ఎమ్మెల్యే కాబట్టి ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఓటు కలిగి ఉంటారు. ఈ లెక్కన తీసుకుంటే ఈ ముగ్గురు ఎక్స్ అఫిషియో సభ్యులతోపాటు 24 మంది కౌన్సిలర్లు కలిపి మొత్తం 27 మందికి మున్సిపల్ కౌన్సిల్‌లో ఓటు హక్కు దఖలు పడుతుంది. కోరం ఉండాలంటే కనీసం 14 మంది సభ్యులు కౌన్సిల్ సమావేశానికి హాజరు కావాలి. ఇక్కడే అధికార టీడీపీ ప్రస్తుతానికి చిక్కులు ఎదుర్కొంటోంది.

రహస్య శిబిరాలు

అధికార, ప్రతిపక్ష పార్టీలు కౌన్సిల్‌పై పట్టుకోసం క్యాంపు రాజకీయాలకు తెరతీశాయి. టీడీపీకి చెందిన మొత్తం 10 మంది సభ్యుల్లో ఒకరిద్దరు తప్ప మిగిలినవారంతా గురువారం ఉదయానికల్లా రహస్య క్యాంపులకు వెళ్లిపోయారు. వీరి వ్యవహారాలు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ స్థానికంగానే ఉండి పర్యవేక్షిస్తున్నారు. మరోవైపు వైసీపీలోని ఒకరిద్దరు కౌన్సిలర్లు తప్ప.. మిగిలిన వారిని ఎంపీ మిథున్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రత్యేక క్యాంపునకు తరలించారు. రెండు శిబిరాలు ఎన్నికలకోసం మోహరించాయి. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌తో కలిసి టీడీపీకి ప్రస్తుతం 11 మంది కౌన్సిలర్లు ఉన్నట్టు లెక్క. కోరం ఉండాలంటే మరో ముగ్గురు కౌన్సిలర్లు అవసరమవుతారు. ఈ ముగ్గురిని తప్పనిసరిగా వైసీపీనుంచే తీసుకురావాల్సి ఉంటుంది. ఇందుకోసం మూడు గ్రూపులుగా విడిపోయిన టీడీపీ నాయకులు తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇప్పటికే వీరి ప్రయత్నాలు ఫలించినట్లు సమాచారం. ఇక వైసీపీ కూడా ఒక్కరిని కూడా చేయిజారి పోకుండా చూడాలని జాగ్రత్త చర్యలకు దిగింది. ఇందులో భాగంగానే ఇప్పటికే ముప్పావువంతుపైగా కౌన్సిలర్లను రెండు గ్రూపులుగా రహస్య శిబిరాలకు తరలించారు. మిగిలిన ఒకరిద్దరిపై సామదానభేద దండోపాయాలు ప్రయోగిస్తున్నట్టు చెబుతున్నారు.

ఎలాగైనా సరే, మున్సిపల్ చైర్మన్ సీటును కైవసం చేసుకుంటామన్న ధీమా అధికార టీడీపీలో కనిపిస్తోంది. అందుకే, ఈ పార్టీలో ఆ సీటుకోసం ముగ్గురు పోటీ పడుతున్నారు. 19వ వార్డు కౌన్సిలర్ జిమ్ దాము, 20 వార్డు కౌన్సిలర్ ఎస్.సోమశేఖర్ మధ్య తీవ్రమైన పోటీ నెలకొంది. 5వ వార్డు కౌన్సిలర్ సెల్వరాజ్ కూడా రంగంలో ఉన్నారు. రెండ్రోజుల కిందట ఒక టీడీపీ ముఖ్య నేత ఇంట్లో జరిగిన సమావేశానికి టీడీపీకి చెందిన 10 మంది కౌన్సిలర్లు హాజరైనట్లు తెలిసింది. చైర్మన్ పదవిని ఆశిస్తున్న ఇద్దరు కౌన్సిలర్ల తరఫునుంచి వాదనలు జరిగినట్లు సమాచారం. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ సమక్షంలో తేల్చుకోవాలన్న నిర్ణయంతో సమావేశం ముగిసింది. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ బుధవారం రాత్రి కుప్పానికి చేరుకోగానే వైసీపీనుంచి వచ్చిన నలుగురు, మొదటినుంచీ టీడీపీలోనే కొనసాగుతున్న ఆరుగురు కౌన్సిలర్లతో

సీల్డ్ కవరే ఫైనల్

విడివిడిగా మాట్లాడినట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయమే ఫైనల్ అని, ఈ విషయంలో వాదోపవాదాలకు తావులేదని స్పష్టం చేసినట్లు చెబుతున్నారు. మున్సిపల్ చైర్మన్‌గిరీ ఎవరిని వరించనుందన్న విషయంలో అధికార టీడీపీలో ఆదివారం సాయంత్రం దాకా సస్పెన్సు కొనసాగే అవకాశం ఉంది. మరోవైపు వైసీపీనుంచి ప్రస్తుత వైస్ చైర్మన్ హఫీజ్, మరో కౌన్సిలర్ పేర్లు వినిపిస్తున్నాయి. ఈ ఇద్దరి పర్యవేక్షణలోనే ఆ పార్టీ కౌన్సిలర్ల శిబిరాలు కూడా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.

మరి మిగతా అక్రమ కేసుల సంగతేమి?

- 'అంగళ్లు' కేసుల మూసివేతతో జిల్లాలో చర్చ
- వైసీపీ హయాంలో టీడీపీలో క్రియాశీల నాయకులపై వందలాది కేసులు
- పుంగనూరు ఘర్షణతో చిత్రహింసలు
- టీడీపీ వచ్చి ఏడాదవుతున్నా.. అక్రమ రౌడీషీట్ల తొలగింపేదీ?

టీడీపీ అధికారంలోకి వచ్చిన ఏడాది కావస్తున్నా.. వైసీపీ ప్రభుత్వం నమోదు చేసిన అక్రమ కేసులు, రౌడీ షీట్ల విషయంలో పురోగతి లేదు. అప్పట్లో వైసీపీ ప్రభుత్వం టీడీపీలో క్రియాశీలకంగా ఉన్న నాయకులపై హత్యాయత్నం కేసులు పెట్టి ఇబ్బందులు పెట్టిన విషయం తెలిసిందే. పుంగనూరు, కుప్పం నియోజకవర్గాల్లో అక్రమ కేసుల బాధితుల సంఖ్య వందల్లో ఉంది. అప్పట్లో అంగళ్లులో నమోదైన కేసుల్ని తప్పుడు కేసులుగా నిర్ధారించి క్లోజ్ చేశారు. దీంతో మన జిల్లాలోని అక్రమ కేసుల మాటేంటని టీడీపీ శ్రేణులు ఆందోళన పడుతున్నాయి.

\- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

వైసీపీ ప్రభుత్వం అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు పర్యటనల్ని కూడా అడ్డుకునేది. జీవో 1 పేరుతో 2023 జనవరిలో సొంత నియోజకవర్గం కుప్పంలో పర్యటించకుండా పోలీసులు అడ్డుకున్నారు. 2023 ఆగస్టులో ఆయన సాగునీటి ప్రాజెక్టుల పరిశీలనకు వచ్చినప్పుడూ అన్నమయ్య జిల్లా అంగళ్లులో, పుంగనూరులో వైసీపీ నాయకులు ఆటంకం కలిగించారు. ఈ రెండు ప్రాంతాల్లోనూ వైసీపీ నేతలు టీడీపీ శ్రేణుల్ని కవ్వించి మరీ రెచ్చగొట్టారు. అంగళ్లలో రాళ్లదాడి చేయగా.. చంద్రబాబు మీద కూడా రాళ్లు వేశారు. ఈ ఘటనలో దేవినేని, అమర్నాథ్‌రెడ్డి వంటి 20 మంది కీలక నేతలతో సహా సుమారు 700 మందికిపైగా కార్యకర్తలపై ముదివేడు పోలీస్‌స్టేషనులో కేసులు నమోదు చేశారు. తాజాగా అన్నమయ్య జిల్లా పోలీసులు అవన్నీ తప్పుడు కేసులని నిర్ధారించి మూసేస్తున్నట్లు కోర్టుకు వివరాలు అందించారు.

పుంగనూరులో ఇలా..

పుంగనూరులో చంద్రబాబు రాకముందే వైసీపీ శ్రేణులు నల్ల దుస్తులతో ధర్నాలు చేసి కవ్వించారు. పోలీసులు కూడా కవ్విస్తున్న వైసీపీ శ్రేణుల్ని కాకుండా చంద్రబాబు పుంగనూరులోకి రాకుండా బైపాస్‌లో బారికేడ్లను ఏర్పాటు చేశారు. దీంతో అక్కడ పోలీసులకు, టీడీపీ శ్రేణుల మధ్య ఘర్షణ జరిగింది. ఇరువర్గాలూ గాయపడ్డాయి. దీన్ని అదనుగా భావించి పెద్దిరెడ్డి, పోలీసులు.. స్పాట్‌లో లేనివారిపై సైతం అక్రమంగా 502 మందిపై హత్యాయత్నం కేసులు పెట్టేశారు. వందల మందిని జైళ్లకు పంపించారు. ఇక్కడ మాత్రం అక్రమ కేసులు, రౌడీషీట్ల తొలగింపు విషయంగా కదలిక లేదు.

ఎందుకు అక్రమ రౌడీషీట్లు అంటే..

సాధారణంగా ఓ వ్యక్తి పదే పదే నేరాలకు పాల్పడితే, అతనిపై కనీసం మూడుకుపైగా ఎఫ్ఐఆర్‌లు నమోదై ఉంటే రౌడీషీట్‌ను తెరుస్తారు. కానీ, పుంగనూరు ఘటనలో మాత్రం ఎలాంటి నేర చరిత్ర లేని వంద మందిపై షీట్లను తెరిచారు. వారంతా కేవలం 2023 ఆగస్టు 5న జరిగిన ఘర్షణలో పాల్గొన్నారనే కారణంగా కేసుల్లో ఇరికించేశారు. సుమారు వంద మందిపై రౌడీ షీట్లను తెరిచారు.

సీఎం చంద్రబాబు చెప్పినా..

సీఎం చంద్రబాబు ఈ ఏడాది జనవరిలో కుప్పంలో పర్యటించినప్పుడు 'వైసీపీ హయాంలో తెరచిన రౌడీషీట్లన్నీ అక్రమమే. నిబంధనలతోపాటు మానవత్వం కోణంతో కూడా ఆలోచించి తొలగించాలి' అని ఎస్పీకి సూచించారు. అంతకుముందు పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా బాబు పలుమార్లు అక్రమ రౌడీషీట్లను తొలగించాలని పోలీసు ఉన్నతాధికారుల్ని కోరారు. ఏం జరిగినా అక్రమ కేసుల కొట్టివేత, అక్రమ రౌడీషీట్ల ఎత్తివేత దిశగా జిల్లా పోలీసులు కసరత్తు ప్రారంభించలేదు. తాజాగా అంగళ్ల కేసుల కొట్టివేత తర్వాతైనా జిల్లా పోలీసుల్లో కదలిక వస్తుందని టీడీపీ శ్రేణులు ఆశిస్తున్నారు.

పుంగనూరు, కుప్పంలను టార్గెట్ చేసి వేధింపులు : వైసీపీ హయాంలో పుంగనూరు, కుప్పం కేంద్రంగా పెద్దిరెడ్డి రాజకీయం చేసి, ఆయా ప్రాంతాల్లోని టీడీపీ శ్రేణుల్ని ఇబ్బంది పెట్టేవారు. ఎస్ఐ నుంచి ఎస్పీ వరకు జీ హుజూర్ అని పెద్దిరెడ్డిని ప్రసన్నం చేసుకునేవారు. అలా 2023 జనవరి 4న చంద్రబాబును పోలీసులు కుప్పంలో పర్యటించకుండా అడ్డుకున్నారు. చంద్రబాబును చూసేందుకు వెళ్తున్న శ్రేణులపై శాంతిపురం మండలం గొల్లపల్లె క్రాస్ వద్ద లాఠీచార్జి చేశారు. 15 మందిపై హత్యాయత్నం కేసులు పెట్టారు. 2022 ఆగస్టు 24, 25 తేదీల్లో చంద్రబాబు పర్యటించే ప్రాంతంలో వైసీపీ నాయకులు జెండాలు కట్టి రెచ్చగొట్టారు. కుప్పంలో అన్న క్యాంటీన్‌ను ధ్వంసం చేసి నిర్వాహకుడ్ని కొట్టారు. అయినా వారిపై కేసులు పెట్టని పోలీసులు.. ఆ రెండ్రోజుల్లో ఏకంగా 72 మందిపై కేసులు పెట్టి 14 మందిని జైలుకు పంపించారు. ఇలా ఐదేళ్లపాటు నిత్యం అక్రమ కేసులతో టీడీపీ శ్రేణుల్ని వేధించేవారు.

సదుం ఇన్‌చార్జి తహసీల్దార్ సస్పెన్షన్

అమ్మగారిపల్లె వీఆర్వో సైతం

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సదుం మండల ఇన్‌చార్జి తహసీల్దార్ ఎస్.ఎం.హుస్సేన్, అమ్మగారిపల్లె వీఆర్వో మహబూబ్ బాషాలను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ గురువారం రాత్రి కలెక్టర్ సుమిత్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. హుస్సేన్ స్థానంలో తాత్కాలిక తహసీల్దార్‌గా సదుం డీటీ కుమార్‌ను నియమించారు. తహసీల్దార్ ఎస్.ఎం.హుస్సేన్, వీఆర్వో మహబూబ్ బాషాలు ఈనెల 19న ఏసీబీ తనిఖీల్లో పట్టుబడ్డ విషయం తెలిసిందే. వీరిద్దరినీ ఏసీబీ అధికారులు నెల్లూరుకు తరలించారు. నెల్లూరు కోర్టు 14 రోజుల రిమాండు విధించింది. ఈ నేపథ్యంలో వీరి రిమాండ్‌పై గురువారం నివేదికను కలెక్టర్‌కు ఏసీబీ డీఎస్పీ జెస్సీ ప్రశాంతి అందజేశారు. ఏసీబీ అధికారులు ఇచ్చిన నివేదిక ఆధారంగా ఇన్‌చార్జి తహసీల్దార్ హుస్సేన్, వీఆర్వో మహబూబ్ బాషాలను విధులనుంచి సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు.

మెగా డీఎస్సీ ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ ప్రారంభం



హాజరైన అభ్యర్థులు

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బీసీ విద్యార్థులకు ప్రభుత్వం మెగా డీఎస్సీ ఉచిత ఆన్‌లైన్ కోచింగ్‌ను ప్రారంభించింది. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా వెనుకబడిన సంక్షేమశాఖ కార్యాలయంలో గురువారం ప్రారంభించిన ఈ కోచింగ్‌కు అభ్యర్థులు హాజరయ్యారు. రోజూ అనుభవం, నైపుణ్యం కలిగిన అధ్యాపకులతో ఇచ్చే కోచింగ్ పేద విద్యార్థుల కలలను నెరవేర్చే విధంగా ఉంటుందని జిల్లా వెనుకబడిన సంక్షేమశాఖ అధికారి మునీంద్రయ్య తెలిపారు.

‘ఆంధ్రజ్యోతి’ లక్కీడ్రా విజేతలకు
బహుమతుల పంపిణీ

తిరుపతి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ‘ఆంధ్రజ్యోతి’ పాఠకులకు కార్ అండ్ బైక్ రేసుకు సంబంధించి గత నెల 25వ తేదీన జరిగిన లక్కీ డ్రాలో విజేతలైన ముగ్గురికి గురువారం తిరుపతిలో బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి పొందిన తిరుపతి గోపాలరాజు కాలనీకి చెందిన డి.వత్సలకు ఆంధ్రజ్యోతి తిరుపతి బ్రాంచి మేనేజరు సురేష్‌రెడ్డి, సర్క్యులేషన్ మేనేజర్ ఉమాపతి హీరో హోండా బైక్‌కు సంబంధించి చెక్ అందజేశారు. తిరుపతి కపిలతీర్థం రోడ్డుకు చెందిన మరుదాడ నగేష్‌కు ద్వితీయ బహుమతి కింద రెఫ్రిజిరేటర్.. పలమనేరు నెహ్రూ నగర్‌కు చెందిన టి.కె.శశిధర్‌కు తృతీయ బహుమతి కింద టీవీ అందజేశారు.








ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద చెక్కు, రిఫ్రిజిరేటర్, టీవీ అందుకుంటున్న వత్సల, నగేష్, టి.కె.శశిధర్

సర్వదర్శనానికి 12 గంటలు




తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంటన్నీ సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ నారాయణగిరి షెడ్ల వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.3.62 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 68,705

తలనీలాలు సమర్పించినవారు: 25,382



ఇలా సిద్ధమైతే... పాలిసెట్ విజేతలు మీరే



గణితం

త్రికోణమితి, నిరూపక రేఖా గణితం, సంభావ్యత, సంఖ్యాశాస్త్రం, పురోగతి, త్రిభుజాలు, వృత్తాలు, ద్విపద సిద్ధాంతం, మాత్రికలు, ఘతాంతక మరియు లాగరిథమిక్ సిరీస్, సమీకరణాల సిద్ధాంతం వంటి వాటిపై విద్యార్థులు పట్టు సాధించాలి. ఐదేళ్ల క్రితం నుంచి ఉన్న ప్రశ్నా పత్రాలను అభ్యాసం చేయగలిగితే మంచి మార్కులు పొందొచ్చు. ప్రభుత్వ పాఠ్య పుస్తకాల్లో ప్రతి ఛాప్టర్ చివరిలోని ముఖ్యాంశాలను చదువుకోవాలి.

ఫిజిక్స్

ఆరు చాప్టర్లు ఉంటాయి. వేడి, సమతల ఉపరితలాలల వద్ద కాంతి వక్రీభవనం, విద్యుత్ ప్రవాహం, వివిధ ఉపరితలాల ద్వారా కాంతి ప్రతిబింబం, మానవ కన్ను, రంగుల ప్రపంచం, విద్యుదయస్కాంతత్వం చాప్టర్లలో ఒక్కో ఛాప్టర్ నుంచి 8 నుంచి 10 ప్రశ్నల వరకు వచ్చే అవకాశం ఉంది.

కెమిస్ట్రీ

పదవ తరగతి కెమిస్ట్రీలో నాలుగు చాప్టర్లు ఉంటాయి. ఒక్కో చాప్టర్ నుంచి 7 నుంచి 8 ప్రశ్నలు వచ్చే అవకాశముంటుంది. మూలకాల వర్గీకరణ-ఆవర్తన పట్టిక, లోహశాస్త్రం సూత్రాలు, రసాయన ప్రతిచర్యలు, సమీకరణాలు, అణువుల నిర్మాణం, రసాయన బంధం, కార్బన్-సమ్మేళనాలు, ఆమ్లాలు, క్షారాలు,లవణాలు అంశాల నుంచి 30 ప్రశ్నలు అడుగుతారు. ముందుగా కెమిస్ట్రీ ప్రశ్నలకు జవాబులు ఇస్తే సమయం కలిసి వస్తుంది.

తిరుపతి(విద్య), ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కోర్సులపై ఆసక్తి పెరుగుతోంది. పదవ తరగతి తర్వాత ఎక్కువ మంది ఈ కోర్సుల్లో చేరేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు. ఇంజనీరింగ్ డిప్లొమా పూర్తిచేసిన విద్యార్థుల్లో ఎక్కువ మందికి ఉద్యోగ,ఉపాధి ఉపాధి అవకాశాలు లభించడమే ఇందుకు కారణం. జిల్లాలో 6 ప్రభుత్వ, 7 ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలున్నాయి. ఎయిడెడ్ కళాశాల కూడా ఉంది. మొత్తం 3500 సీట్లు ఉన్నాయి. ఈ కోర్సుల ప్రవేశానికి ఈనెల 30న జరిగే పాలిసెట్ పరీక్షకు సిలబస్‌ను బాగా చదువుకుంటే విజేతగా నిలవడం సులభమేనంటున్నారు ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల జనరల్ సెక్షన్ హెడ్ డాక్టర్ ఎస్.వి. గౌరీశంకర్. రెండు గంటల్లో 120 ప్రశ్నలకు సరైన సమాధానాలు రాయగలిగేలా టైం ప్లాన్ చేసుకోవాలంటున్నారు. పదవ తరగతి సిలబస్ నుంచి గణితంలో 50 మార్కులకు, ఫిజిక్స్ 40, కెమిస్ట్రీ 30 మార్కులకు ఆబ్జెక్టివ్ విధానంలో ప్రశ్నాపత్రం ఉంటుంది. నెగెటివ్ మార్కులు ఉండవు. సబ్జెక్టుల వారీగా ఆయన సూచనలిలా..



డాక్టర్ **ఎస్.వి. గౌరీశంకర్,** జనరల్ సెక్షన్ హెడ్, ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, తిరుపతి.

కళాశాలు వివరాలు


- **తిరుపతి:** బయోమెడికల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజినీరింగ్ (షుగర్ టెక్నాలజీ), కంప్యూటర్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ ఇండస్ట్రీ ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్, సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్, ఫార్మసీ (ఇంటర్ అర్హతతో).
- **చంద్రగిరి:** ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్
- **కిల్లాపట్టు:** మెకానికల్, సివిల్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్స్ ఇంజనీరింగ్.
- **సత్యవేడు:** మెకానికల్, సివిల్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్.
- **గూడూరు:** మైనింగ్, మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్, గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిరామిక్ టెక్నాలజీ. (ప్రత్యేక కళాశాల).
- **తిరుపతి టీటీడీ పద్మావతి మహిళా పాలిటెక్నిక్ కళాశాల:** కంప్యూటర్ అండ్ కమర్షియల్ ప్రాక్టీస్‌తో పాటు కంప్యూటర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్, ఫార్మసీ (ఇంటర్ అర్హత) బ్రాంచిలున్నాయి.

మంచి భవిష్యత్తు



పాలిటెక్నిక్ విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుంది. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తాయి. కోర్సు పూర్తిచేసివారు ఎంట్రన్స్ ర్యాంకుతో నేరుగా బీటెక్ రెండో సంవత్సరంలో చేరవచ్చు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు కళాశాలల్లోని సహాయక కేంద్రాలలో సంప్రదించి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చు.

- డాక్టర్ ద్వారకానాథ్‌రెడ్డి, ప్రిన్సిపాల్, ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల



టీటీడీకి విరాళంగా ఎలక్ట్రిక్ స్కూటర్



టీటీడీకి గురువారం ఓ ఎలక్ట్రిక్ స్కూటర్ విరాళంగా అందింది. మహారాష్ట్రకు చెందిన బిగాస్ ఆటో ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ గురువారం రూ.1.40 లక్షల విలువైన బిగాస్ సీ12 మాక్స్ 3.0 అనే ఎలక్ట్రిక్ స్కూటర్‌ను టీటీడీకి అందజేసింది. ముందుగా వాహనానికి శ్రీవారి ఆలయం ముందు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ డిప్యూటీఈవో లోకనాథంకు ఆ సంస్థ వైస్ ప్రెసిడెంట్ దుర్గేష్ గుప్తా వాహన తాళాన్ని అందజేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

డిప్యూటీ సీఎంకు సాదర వీడ్కోలు



రేణిగుంట, ఏప్రిల్ 24, (ఆంధ్రజ్యోతి) : ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు తిరుపతి విమానాశ్రయంలో సాదర వీడ్కోలు లభించింది. పెహల్గాంలో ఉగ్రవాదుల కాల్పుల్లో మృతిచెందిన నెల్లూరు జిల్లా కావలికి చెందిన మధుసూదన్‌రావుకు గురువారం నివాళులర్పించేందుకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెళ్లారు. అక్కడ్నుంచి రోడ్డు మార్గాన సాయంత్రం 6.10 గంటలకు తిరుపతి విమానాశ్రయం చేరుకోగా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఏఎస్పీ రవిమనోహరచారి, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, తహశీల్దార్ సురేష్‌బాబు, ఉమ్మడి జిల్లా జనసేన అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, శ్రీకాళహస్తి జనసేన ఇన్‌చార్జి కోట వినుత వీడ్కోలు పలికారు. ఆయన ప్రత్యేక విమానంలో విశాఖపట్నం వెళ్లారు.

హత్య కేసులో ముగ్గురికి యావజ్జీవం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): హత్య కేసులో ముగ్గురికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ శ్రీకాళహస్తి న్యాయస్థానం తీర్పు ఇచ్చినట్లు కోర్టు లైజనింగ్ అధికారి గోపాల్‌రాజు గురువారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఏర్పేడు మండలం చెల్లూరుకు చెందిన సుబ్బమ్మ, కుమారుడు జగ్గయ్యతో కలిసి నివాసం ఉండేది. ఆమె భర్త బాలసుబ్రహ్మణ్యం కుటుంబ కలహాలతో మునలిపేడులో ఉంటున్నాడు. అనారోగ్యంతో ఆయన 2016లో మృతి చెందాడు. భర్త కర్మక్రియల కోసం కుమారుడితో కలిసి సుబ్బమ్మ అప్పట్లో మునిలిపేడుకు వెళ్లగా, ఇంటి స్థలం విషయమై వారిమధ్య విభేధాలు ఉండటంతో భర్త తరపు బంధువులు ఆమెను అడ్డుకుని వెళ్లగొట్టారు. ఆ తర్వాత 2017 ఏప్రిల్‌లో పోలీస్‌స్టేషన్ ఎదుట ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని నిరసన చేస్తున్న వారిపై లారీ దూసుకెళ్లిన ఘటనలో మృతిచెందిన వారిలో మునిలిపేడుకు చెందిన సుబ్బమ్మ దాయాదులైన బాబు, హరి ఉన్నారు. 2017 మే 11న మునిలిపేడులో దాయాదుల కర్మక్రియలకు సుబ్బమ్మ, జగ్గయ్య వెళ్లగా.. మళ్లీ భర్త తరపు బంధువులు ఆమెతో వాగ్వాదానికి దిగారు. కొందరు పెద్దలు ఇరువర్గాలకు చెప్పారు. ఈ క్రమంలో బాలసుబ్రహ్మణ్యం సోదరి సుజాత బొడ్డులో కత్తి పెట్టుకుని వచ్చి వదిన సుబ్బమ్మను పొడవడంతో ఆమె కుప్పకూలారు. సుజాతకు భర్త వెంకటేష్, అత్త రాణెమ్మ సహకరించారు. ఆ తర్వాత జగ్గయ్యను కూడా పొడిచేందుకు ప్రయత్నించగా మిగతావారు అడ్డుకున్నారు. గాయపడిన సుబ్బమ్మను తిరుపతి రుయాకు తరలించగా అదే రోజు రాత్రి ఆమె మృతి చెందింది. జగ్గయ్య ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ వెంకటరమణ హత్యకేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఏ1 సుజాత, ఏ2 రాణెమ్మ, ఏ3 వెంకటేష్‌ను అప్పట్లో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శ్రీకాళహస్తి న్యాయస్థానంలో విచారణఅనంతరం గురువారం 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్ ముగ్గురు నిందితులకు యావజ్జీవశిక్షతో పాటు రూ.15వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ కేసు ఛేదనలో పీపీ వీరరాఘవరెడ్డి, కోర్టు మానటరింగ్ సీఐ వెంకటప్ప తదితరులు చొరవ చూపారు. చురుగ్గా వ్యవహరించిన ఏర్పేడు పోలీసు అధికారులను ఎస్పీ హర్షవర్ధనరాజు అభినందించారు.

రెవెన్యూ అధికారులు లంచం అడుగుతున్నారా?

- బోడిలింగాలపాడు గ్రామస్థులను అడిగిన కలెక్టర్

తడ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ‘రెవెన్యూ అధికారులు, సిబ్బంది మిమ్మల్ని లంచాలు అడుగుతున్నారా? లేకపోతే ఇబ్బందులు పెడుతున్నారా?’ అని కలెక్టర్ వెంకటేశ్వర్ స్థానికులను ప్రశ్నించారు. తండ మండలం తడకండ్రిగ పంచాయతీ బోడిలింగాలపాడులో గురువారం పర్యటించిన ఆయన స్థానికులతో మాట్లాడారు. సమస్యలపై ఆరా తీశారు. రెవెన్యూ సదస్సుల అర్జీల పరిష్కారంపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో రెవెన్యూ సిబ్బంది వల్ల ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగారు. బోడిలింగాలపాడు జాతీయ రహదారి మలుపు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని దానిపై చర్యలు తీసుకోవాలని, చెత్త సంపద తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. నెల్లూరుజిల్లా జాతీయ రహదారుల ప్రాజెక్టు డైరెక్టర్‌కు ఫోన్‌చేసి ఆ మలుపును పరిశీలించి వెంటనే నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.



గ్రామస్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

రూ.25 కోట్లతో హాస్టళ్ల మరమ్మతులు

జిల్లాలో రూ.25 కోట్లతో సుమారు 110 హాస్టళ్ల మరమ్మతులు, మౌలిక సదుపాయాల పనులు చేపడుతున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. తడలోని బీసీ బాలుర వసతి గృహంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. హాస్టళ్లలో మౌలిక వసతుల కోసం ప్రభుత్వం రూ.6 కోట్లను మంజూరు చేసిందని, అదనంగా కావాల్సిన సౌకర్యాల కోసం జిల్లాస్థాయిలోనే పరిశ్రమల సీఎస్ఆర్ నిధులు, బీఎంఎస్, ఎంపీలాడ్స్ నుంచి రూ.25 కోట్లు సమకూర్చుకుని అభివృద్ధి పనులకు కేటాయిస్తున్నామన్నారు. వీటిద్వారా ఆర్‌వో వాటర్, రూఫ్ ట్రీట్‌మెంట్, మరుగుదొడ్లు, పర్మినెంట్ వంటగది, దోమల తెరలతో కూడిన కిటికీలు వంటివి ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ పనులన్నీ విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కలెక్టర్‌తో పాటు ఆర్డీవో కిరణ్మయి, తడ, సూళ్లూరుపేట తహసీల్దార్లు శరత్‌బాబు, నరసింహారావు, ఎంపీడీవో విజయ్ కుమార్, సూళ్లూరుపేట ఎస్ఐ బ్రహ్మనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంకీర్తనల వైపు యువతను తీసుకెళ్లాలి



అధికారులతో సమీక్షిస్తున్న ఈవో శ్యామలరావు

తిరుపతి(టీటీడీ), ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): తాళ్లపాక అన్నమయ్య సంకీర్తనలను యువతకు యూట్యూబ్ ద్వారా చేరువ చేయాలని టీటీడీ ఈవో శ్యామలరావు అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని పరిపాలనా భవనంలో గురువారం వివిధ విభాగాధిపతులతో సమీక్ష నిర్వహించారు. ఈవో మాట్లాడుతూ ఎస్వీబీసీ ద్వారా సంకీర్తనలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఇందుకోసం నిపుణులతో కమిటీ ఏర్పాటు చేసి వారి సలహాలు, సూచనలతో వేగవంతంగా సంకీర్తనలను యూట్యూబ్‌లో ఉంచేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. తిరుపతిలో జరుగుతున్న వివిధ ఇంజినీరింగ్ పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. వేసవి సందర్భంగా స్థానికాలయాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యమూ లేకుండా, రద్దీకనుగుణంగా చర్యలు చేపట్టాలని జేఈవోను ఆదేశించారు. అనంతరం తిరుపతిలోని ఆరోగ్య విభాగం, శ్వేత, టీటీడీ కొనుగోళ్ల విభాగం, స్విమ్స్, విద్య, వైద్యం తదితర విభాగాల అధికారులతో సమీక్షించారు. సమావేశంలో వేద విశ్వవిద్యాలయం వీసీ రాణి సదాశివమూర్తి, ఎఫ్ఏ అండ్ సీఏవో బాలాజీ పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో 22 మంది డిబార్

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ పరిధిలో చేపట్టిన డిగ్రీ రెండు, నాలుగు సెమిస్టర్ పరీక్షల్లో 22 మంది విద్యార్థులు డిబార్ అయ్యారు. మదనపల్లె-16, చిత్తూరు-6 మంది మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న విషయాన్ని గుర్తించి హైపవర్ కమిటీ డిబార్ చేసినట్లు పరీక్షల అధికారి దామ్లా నాయక్ తెలిపారు.

ఉగ్రవాదులే వస్తే..
తిరుమలలో ఆక్టోపస్ మాక్ డ్రిల్



విశ్రాంతి భవనంలోకి వెళుతున్న ఉగ్రవాదులు



ఉగ్రవాదుల సమాచారమిస్తున్న విజిలెన్స్ వీజీవో

అది తిరుమల లేపాక్షి సర్కిల్ వద్దనున్న సుదర్శన్ విశ్రాంతి భవనం. గురువారం సాయంత్రం ముగ్గురు ఉగ్రవాదులు వాహనంలో వచ్చి పాకిస్థాన్ జిందాబాద్, జీహాద్ అంటూ కేకలు వేస్తూ వచ్చారు. విశ్రాంతి గృహ ప్రవేశం వద్ద ఇద్దరు సెక్యూరిటీ గార్డులను గాయపరిచారు. ఒక ఉగ్రవాది అంతస్థు పైభాగంలోకి.. మరొకరు ఓ గదిలోకి.. ఇంకొకరు భవనం ప్రవేశంలోకి చేరారు. విజిలెన్స్ సిబ్బంది సమాచారంతో వీజీవో, స్థానిక పోలీసు అధికారులతో పాటు ఓ కమెండో ఆధ్వర్యంలో 29 మంది ఆక్టోపస్ సిబ్బంది లేపాక్షి సర్కిల్‌కు చేరుకున్నారు. భవనం మ్యాప్‌ను పరిశీలించారు. మూడు బృందాలుగా విడిపోయారు. భవనం ప్రవేశంలో ఉన్న ఓ ఉగ్రవాదిని అసాల్ట్ డాగ్ ఎనిమీ విధానంలో హతమార్చారు. ఆ తర్వాత భవనంలోకి వెళ్లి, ఓ గదిలో దాక్కున్న ఉగ్రవాదిని, ఆ తర్వాత భవనంపై ఉన్న మరో ఉగ్రవాదిని హతమార్చారు. అప్పటికే విశ్రాంతి భవనం వద్దకు చేరుకున్న వైద్య సిబ్బంది ఉగ్రవాదుల దాడిలో గాయపడిన భక్తుడు, సిబ్బందికి చికిత్స అందజేసి ఆస్పత్రికి తరలించారు. ఇక, ఫైర్ సిబ్బంది కూడా ఉగ్రవాదులు ద్వారా తలెత్తిన మంటలను అదుపుచేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి




విశ్రాంతి భవనంలోకి ప్రవేశిస్తున్న అక్టోపస్ సిబ్బంది - రూమ్ ఇన్టర్వెన్షన్ విధానంలో మరో ఉగ్రవాదిని అదుపులోకి తీసుకున్న అక్టోపస్ సిబ్బంది

- పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో తిరుమలలో ఆక్టోసప్ బృందం ఇలా దాదాపు ఒకటిన్నర గంట పాటు జరిపిన మాక్‌డ్రిల్ ఇది. భక్తులు బస చేసే అతిథిగృహంలోకి ఉగ్రవాదులే వస్తే ఎలా స్పందించాలనే దానిపై మాక్ డ్రిల్ జరిగింది. దాదాపు 30 మంది అక్టోపస్ సిబ్బంది, 25 మంది విజిలెన్స్, 15 మంది పోలీసులు, 10 మంది ఏపీఎస్పీ సిబ్బంది డ్రిల్‌లో పాల్గొన్నారు.






విశ్రాంతి భవనం ముందున్న ఉగ్రవాదిని అసాల్ట్ డాగ్ ఎనిమీ విధానంలో హతమారుస్తున్న సిబ్బంది - విశ్రాంతి భవనం పైభాగంలో మరో బృందం - ఉగ్రవాదిని హతమార్చుతున్న సిబ్బంది



గాయపడిన భక్తుడిని ఆస్పత్రికి తరలిస్తున్న వైద్య సిబ్బంది




డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నుంచి అవార్డు అందుకున్న డీపీవో సుధాకరరావు - గుంజార్లపల్లె సర్పంచ్ విజయరామిరెడ్డి

పన్ను వసూళ్లలో ప్రథమస్థానం

డిప్యూటీ సీఎం నుంచి అవార్డు స్వీకరించిన డీపీవో

చిత్తూరు కలెక్టరేట్/శాంతిపురం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలకు సంబంధించి పన్ను వసూళ్లలో మన జిల్లా రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. 2024-25లో పన్ను, పన్నేతర వసూళ్ల లక్ష్యంలో రూ.24.25 కోట్లకుగాను రూ.21.34 కోట్లు వసూలు చేసింది. దీనికి సంబంధించిన అవార్డును, ప్రశంసాపత్రాన్ని జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గురువారం మంగళగిరిలోని సి.కె.కన్వెన్షన్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) కె.సుధాకరరావుకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రదానం చేశారు. అలాగే జలజీవన్ మిషన్ కార్యక్రమంలో ప్రతిభ చూపిన గుడిపాల మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్, చీలాపల్లె సర్పంచ్ అరుణ్‌లు కూడా ప్రశంసా పత్రాలు అందుకున్నారు.

ఉత్తమ పంచాయతీగా గుంజార్లపల్లె

స్వయం సమృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనలో రాష్ట్రస్థాయిలో గుంజార్లపల్లె ఉత్తమ పంచాయతీగా ఎంపికైంది. దీంతో సర్పంచ్ విజయరామిరెడ్డి కూడా అవార్డు, ప్రశంసా పత్రం డిప్యూటీ సీఎం నుంచి అందుకున్నారు. సర్పంచ్‌ని ఎంపీడీవో ఏపీఆర్ కుమార్, పంచాయతీ రాజ్ సిబ్బంది అభినందించారు.

డీఈవో సైట్‌లో ఎస్జీటీల సీనియారిటీ జాబితా

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని సెకండరీ గ్రేడ్ టీచర్ల (ఎస్జీటీ) సీనియారిటీ జాబితాను గురువారం డీఈవో వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ఈ మేరకు డీఈవో వరలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్జీటీ జనరల్ సీనియారిటీ జాబితా మెరిట్ ఆధారంగా.. యాజమాన్యాల వారీగా రెండు సార్లు వెబ్‌సైట్‌లో పొందుపర్చి, వాటిపై వచ్చిన అభ్యంతరాలు స్వీకరించామన్నారు. ఆ మేరకు సరిచేసి ఎస్జీటీ సీనియారిటీ జాబితాను డీఈవో వెబ్‌సైట్‌లో పెట్టినట్లు వివరించారు.

ఉగ్రదాడి ఘటన కలచివేసింది

ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

చిత్తూరు సిటీ/ వెదురుకుప్పం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పహల్గాంలో ఉగ్రదాడి ఘటన తనను తీవ్రంగా కలచి వేసిందని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇది ఉగ్రవాదుల పిరికిపంద చర్యగా అభివర్ణించారు. మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామని, క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని కోరుకున్నట్లు పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు, క్షతగాత్రులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్నివిధాలా అండగా నిలబడడం అభినందనీయమన్నారు.

విచారకరం: రాష్ట్ర ప్రభుత్వ విప్ థామస్

ఉగ్రదాడిలో అమాయక ప్రజల ప్రాణాలు కోల్పోవడం విచారకరమని రాష్ట్ర ప్రభుత్వ విప్ డాక్టర్ వీఎం థామస్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ హింసాత్మక ఘటన తన మనసును కలచివేసిందన్నారు. బాధితులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానన్నారు.

నేడు, రేపు న్యాయవాదుల విధుల బహిష్కరణ

చిత్తూరు లీగల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదుల దాడులను ఖండిస్తూ శుక్ర, శనివారాల్లో న్యాయవాదులు విధులు బహిష్కరిస్తున్నట్లు చిత్తూరు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు శంకర్ నాయుడు, కార్యదర్శి సురేష్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉగ్రవాదుల చేతుల్లో మృతి చెందిన వారి ఆత్మలకు శాంతి కలగాలని వారు పేర్కొన్నారు.

పీసీపీఎన్‌డీటీ చట్టాలను పటిష్ఠంగా అమలు చేయండి: ఆర్డీవో

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): భ్రూణ హత్యలను నివారించడానికి పీసీపీఎన్‌డీటీ చట్టాలను పటిష్ఠంగా అమలు చేయాలని అధికారులను చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం తన కార్యాలయంలో పీసీపీఎన్‌డీటీ చట్టంపై డివిజన్ స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలో ప్రతి వెయ్యి మంది మగ శిశువులకు కేవలం 954 మంది ఆడ శిశువులు మాత్రమే ఉన్నారని చెప్పారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ కేంద్రాలపై నిఘా ఉంచాలని, అవసరమైతే డెకాయ్ ఆపరేషన్లు చేయాలన్నారు. నోడల్ అధికారి అనిల్, దిశ సీఐ మహేశ్వర్, డాక్టర్లు ఉషశ్రీ, లత, చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ.. మరెన్నో ఉదయాలకు మార్గం

● ఎస్పీ మణికంఠ



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ మణికంఠ


చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు హెల్మెట్ ధరించి వాహనాలను నడిపితే మరెన్నో ఉదయాలకు మార్గం కనిపిస్తోందని ఎస్పీ మణికంఠ అన్నారు. హెల్మెట్ ధారణపై అవగాహన పెంపొందించేందుకు రూపొందించిన ప్రత్యేక పాట ఆవిష్కరణ కార్యక్రమం గురువారం చిత్తూరు గాంధీ విగ్రహం కూడలి వద్ద జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ మాట్లాడుతూ, హెల్మెట్ ధరించకపోవడం వల్ల జిల్లాలో ఏటా 140 మంది ద్విచక్ర వాహనదారులు చనిపోతుంటే.. 400 నుంచి 500 మంది వరకు గాయాలపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఏఎస్పీ శివానందకిశోర్, ఏఆర్ డీఎస్పీలు చిన్నికృష్ణ, మహబూబ్‌బాషా, ఈస్ట్ సర్కిల్ సీఐ శ్రీనివాసులు, ట్రాఫిక్ సీఐ నిత్యబాబు, ఆర్‌ఐలు భాస్కర్, సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ : సర్పంచ్‌కు గాయాలు

విజయపురం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఇరువర్గాల మధ్య ఘర్షణలో ఓ సర్పంచ్ గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. విజయపురం మండలంలోని ఎం.అగరంలో ఉపాధి క్షేత్ర సహాయకుల నియామకం నిమిత్తం క్షేత్ర సహాయకుడు, టీడీపీ నాయకుడు.. ఎం.అగరం సర్పంచ్ సుధాకర్ మధ్య ఘర్షణ జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ గాయపడ్డాడు. ఇరువర్గాలపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రంగా తెలిపారు.

మిస్టర్ ఇండియా ఫ్రాన్స్ విజేతకు అభినందనలు

పలమనేరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మిస్టర్ ఇండియా ఫ్రాన్స్-2025 విజేతను పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి గురువారం అభినందించారు. ప్యారిస్‌కు చెందిన మిస్టర్ ఇండియా ఫ్రాన్స్ 2025 విజేత ఎం.జ్ఞానకిరణ్ శ్రీకరణ్ పలమనేరులోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈనెల 5న జరిగిన పోటీల్లో మిస్టర్ ఇండియా ఫ్రాన్స్‌గా బరిలో నిలిచి వివిధ విభాగాల్లో ప్రతిభ చూపాడు.



ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని కలిసిన జ్ఞానకిరణ్ శ్రీకరణ్

గాయపడిన దుప్పి మృతి



గుడిపాల ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): గుడిపాల మండలంలోని రామభద్రాపురంలో గురువారం గాయాలతో ఉన్న దుప్పి ఒకటి గ్రామస్తుల కంటపడింది. తెలుగుయువత రాష్ట్ర అధికారి ప్రతినిధి హేమాద్రి నాయుడు, గ్రామస్తులు కలిసి దుప్పికి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం వారు అటవీశాఖకు సమాచారం అందించగా, వారు వచ్చేలోపే దుప్పి మృతి చెందింది. కళేబరాన్ని అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిర్వహించారు.

ప్రభుత్వ బడుల్లో టెన్త్ ఫలితాలపై భిన్నాభిప్రాయాలు..!

● 30 నుంచి ఏడుకు పడిపోయిన వంద శాతం ఉత్తీర్ణత పాఠశాలల సంఖ్య

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): టెన్త్ ఫలితాల్లో భాగంగా గత ఏడాది జిల్లాలో 30 ప్రభుత్వ పాఠశాలలు వంద శాతం ఫలితాలు సాధించగా, ఈ ఏడాది ఆ సంఖ్య ఏడుకు పడిపోయింది. 95.60 శాతం ఉత్తీర్ణతతో గుడిపాల మండలం జిల్లాలో తొలి స్థానం కైవసం చేసుకోగా, 35.83 శాతం ఉత్తీర్ణతతో ఎస్ఆర్‌పురం మండలం చివరి స్థానంలో నిలిచింది. జిల్లాలోని ఏడు ప్రభుత్వ పాఠశాలల్లో అయితే ఐదుగురికి మించి ఉత్తీర్ణత సాధించలేదు. ఈ క్రమంలో జిల్లాలో టెన్త్ ఫలితాలపై భిన్నాభిప్రాయాలు అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

ఎందుకిలా..

బోధనలోపం కొట్టొచ్చినట్లు కనిపించినా, వాటికి కారణం సమగ్రశిక్ష అధికారులనే వాదనలు వినిపిస్తున్నాయి. డీఈవో, డీవైఈవో, ఎంఈవో 1,2, సమగ్రశిక్ష ఏపీసీ, సెక్టోరియల్స్ వీరంతా పాఠశాలల్లో బోధన విధానాలు, విద్యార్థుల సామర్థ్యాలు, వాటి మెరుగు అనే అంశాలపై దృష్టి సారించాల్సి ఉంది. ప్రధానంగా పాఠశాలల నిరంతర పర్యవేక్షణలో ఎంఈవోలతోపాటు సమగ్ర శిక్షలోని సెక్టోరియల్ అధికారుల పాత్ర ప్రధానంగా ఉంటుంది. ప్రతి సెక్టోరియల్ రోజుకు కనీసం ఒకటి, రెండు, ఆపై పాఠశాలలు తనిఖీ చేసి, ప్రార్థన సమయం నుంచి బోధన, విద్యార్థుల సామర్థ్యం, పరీక్షల నిర్వహణ, వచ్చిన మార్కులు, మధ్యాహ్న భోజనం నాణ్యత, పాఠశాల ప్రాంగంలోని మౌలిక వసతులు, తాగునీరు ఇలా అనేక రకాలైన అంశాలపై పరిశీలించాల్సి ఉంది. విద్యాశాఖకు ఆయువుపట్టులా ఉండాల్సిన సమగ్రశిక్ష విభాగం అధికారులు పలు కారణాలతో పాఠశాల తనిఖీలు మమ అనిపించారనే విమర్శలున్నాయి. వీటికితోడు రెండు నెలల కాలంగా టీచర్స్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (టిస్)లో ఉపాధ్యాయుల వివరాలు పొందుపర్చడం, ఉపాధ్యాయుల పదోన్నతులు, సీనియారిటీ జాబితా తయారీ, అభ్యంతరాల స్వీకరణ తదితర పరిపాలన అంశాలు సైతం తెరపైకి రావడంతో టీచర్లు వీటిపై చూపిన శ్రద్ధ, విద్యార్థులపై చూపలేదన్న ఆరోపణలూ లేకపోలేదు. ఇక విద్యాశాఖ అధికారులు టీచర్ల సీనియారిటీ జాబితా తయారీపై రాత్రింబవళ్లు దృష్టి పెట్టడంతో టెన్త్ విద్యార్థులకు పాఠశాల విద్య సూచించిన వంద రోజుల ప్రణాళిక సరైన విధానంలో అమలు చేయలేదన్న కారణాలు సైతం లేకపోలేదు. వెనుకబడిన సబ్జెక్టుల విద్యార్థులను నామమాత్రంగా చదివించడం మినహా ఆయా టీచర్లు ప్రత్యేక దృష్టి సారించకపోయారని సమాచారం.

ఐదుగురు విద్యార్థుల్లోపు పాసైన పాఠశాలలు

పాఠశాల/మండలం	మొత్తం విద్యార్థులు	పాస్
జడ్పీహెచ్ఎస్, ముక్కలత్తూరు/జీడీ నెల్లూరు	25	1
జడ్పీహెచ్ఎస్, తంబుగానిపల్లె/బంగారుపాళ్యం	10	1
జడ్పీహెచ్ఎస్, కె.నక్కనపల్లె/వి.కోట	7	1
జడ్పీహెచ్ఎస్, కోలమడుగు/శాంతిపురం	7	1
జడ్పీహెచ్ఎస్, నరసింహారాజపురం/ఎస్ఆర్‌పురం	20	3
సీఎస్ఐ-హెచ్ఎస్, కొల్లాగుంట/కార్వేటినగరం	29	4
జడ్పీహెచ్ఎస్ (బాలురు)/రామకుప్పం	25	5

వంద శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలు

పాఠశాల/మండలం	మొత్తం విద్యార్థులు	పాస్
జడ్పీహెచ్ఎస్, గొడుగుచింత/పూతలపట్టు	7	7
జడ్పీహెచ్ఎస్, పాలమంద/ సదుం	8	8
జడ్పీహెచ్ఎస్(ఉర్దూ), 14 కండ్రిగ/ యాదమరి	13	13
జడ్పీహెచ్ఎస్ ఏఎల్‌పురం/గుడిపాల	30	30
ఏపీఎస్‌డబ్ల్యూఎస్ (బాలురు)/ పూతలపట్టు	75	75
ఎంజేపీఏపీబీసీడబ్ల్యూఆర్ఎస్ (బాలురు)/ సదుం	77	77
ఏపీఆర్ఎస్ (బాలికలు) కమ్మపల్లె/ బైరెడ్డిపల్లె	81	81

మండలాల వారీగా ఉత్తీర్ణత శాతం వివరాలు

మండలం	మొత్తం విద్యార్థులు	పాస్	ఫెయిల్	శాతం
గుడిపాల	273	261	12	95.60
పూతలపట్టు	447	384	63	85.91
సదుం	245	210	35	85.71
పాలసముద్రం	182	149	33	81.87
తవణంపల్లె	362	292	70	80.66
చిత్తూరు	3044	2311	733	75.92
సోమల	358	269	89	75.14
గంగవరం	688	507	181	73.69
పుంగనూరు	1296	941	355	72.61
కార్వేటినగరం	412	293	119	71.12
విజయపురం	198	140	58	70.71
వెదురుకుప్పం	436	308	128	70.64
పలమనేరు	1277	901	376	70.56
పెద్దపంజాణి	671	473	198	70.49
ఐరాల	381	262	119	68.77
నగరి	1115	756	359	67.80
బైరెడ్డిపల్లె	736	493	243	66.98
నింద్ర	194	129	65	66.49
చౌడేపల్లె	522	339	183	64.94
యాదమరి	412	266	146	64.56
కుప్పం	1833	1130	703	61.65
జీడీ నెల్లూరు	669	402	267	60.09
రొంపిచెర్ల	261	153	108	58.62
శాంతిపురం	722	416	306	57.62
పెనుమూరు	313	180	133	57.51
వి.కోట	1088	623	465	57.26
బంగారుపాళ్యం	774	424	350	54.78
పులిచెర్ల	311	169	142	54.34
గుడుపల్లె	576	312	264	54.17
రామకుప్పం	679	338	341	49.78
ఎస్ఆర్‌పురం	321	115	206	35.83
	20,796	13,946	6850	67.06

శ్రీదుర్గ మృతికి అపోలో నిర్లక్ష్యమే కారణం

● న్యాయ విచారణకు ప్రభుత్వం ఆదేశించాలి
● లేదంటే ఆమరణ నిరాహార దీక్ష చేపడతా
● టీడీపీ సీనియర్ రాష్ట్ర నేత షణ్ముగం



కన్నీరు పెట్టుకున్న షణ్ముగం

చిత్తూరు అర్బన్/సిటీ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): తన కుమార్తె, టీడీపీ చిత్తూరు పార్లమెంటు మహిళా విభాగం కార్యదర్శి శ్రీదుర్గ మృతికి ముమ్మాటికీ అపోలో వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బీసీ సంక్షేమ సంఘం దక్షిణాది రాష్ట్రాల ఇన్‌చార్జి, టీడీపీ సీనియర్ రాష్ట్ర నేత షణ్ముగం ఆరోపించారు. గురువారం బీసీ సంక్షేమ సంఘ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. గతవారం తన కుమార్తె ఫారెస్టు రోడ్డులో ద్విచక్రవాహనంలో వెళుతుండగా ప్రమాదం జరిగిందన్నారు. చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో పరీక్షలు చేసిన వైద్యులు ఎలాంటి ప్రాణాపాయం లేదని ప్రథమ చికిత్స చేసి.. ఇంటికి పంపారని తెలిపారు. ఇంటికి వచ్చిన 18 గంటల వ్యవధిలోనే తన బిడ్డ తీవ్ర అస్వస్థతకు గురైందని, వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లగా మృతి చెందిందని చెప్పడం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. ఇక్కడ అపోలో వైద్యుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనపడుతుందన్నారు. త్వరలోనే అపోలో వైద్యుల నిర్లక్ష్య వైఖరిపై అన్ని రాజకీయ పార్టీ నేతలతో కలిసి సమావేశాన్ని ఏర్పాటు చేస్తానని తెలిపారు. ఒక దశలో ఆయన కన్నీరు పెట్టుకున్నారు. ఆస్పత్రికి ఇచ్చిన లీజును రద్దు చేయడంతో పాటు న్యాయ విచారణకు ప్రభుత్వం ఆదేశించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే ఆస్పత్రి వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేపడతానని హెచ్చరించారు.

పరామర్శించిన వివిధ పార్టీల నేతలు

శ్రీదుర్గ కుటుంబీకులను వివిధ పార్టీల నేతలు పరామర్శించారు. గురువారం సంతపేటలోని షణ్ముగం నివాసానికి వెళ్లి శ్రీదుర్గ చిత్రపటానికి పూలమాలవేసి, నివాళి అర్పించారు. వీరిలో.. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, విశాఖపట్నం ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, బీజేపీ సీనియర్ నేత, మాజీ ఎంపీ దుర్గా రామకృష్ణ, వైసీపీ సీనియర్‌నేత భూపేష్ గోపీనాథ్ తదితరులున్నారు.

శ్రీదుర్గ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు →



పంటలపై ఆగని గజ దాడులు



యాదమరి మండలం కె.కొత్తూరు వద్ద ధ్వంసమైన వరి పంట

కల్లూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల దాడులు ఆగడంలేదు. నిత్యం ఎక్కడో ఒక ప్రాంతంలో పంటలను ధ్వంసం చేస్తూనే ఉన్నాయి. దేవళంపేట పంచాయతీలోని పంటలను బుధవారం రాత్రి కూడా ఒంటరి ఏనుగు ధ్వంసం చేసింది. తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని చింతలవంక నుంచి గెండేవారిపల్లె మీదుగా నాయినిచెరువు సమీపానికి ఒంటరి ఏనుగు తొలుత చేరుకుంది. మిట్టమీదరాచపల్లెలోని రైతు శిద్దయ్యకు చెందిన వరి పంటను, కొబ్బరిచెట్లను, నీటి పైపులను, పొలం వద్ద ఏర్పాటు చేసుకున్న గుడిసెను ధ్వంసం చేసింది. తర్వాత పెనుబాలవారిపల్లెలోని రైతు నారాయణకు చెందిన వరిపంటను తొక్కుకుంటూ అడవి మార్గం వైపు వెళ్లింది. ధ్వంసమైన పంటలను ఇన్‌చార్జి ఎఫ్‌బీవో హరిప్రియ పరిశీలించారు. అటవీ ప్రాంతంలోని చింతలవంక వద్ద ఒంటరి ఏనుగు తిష్ట వేసినట్లు ఆమె తెలిపారు.

యాదమరి మండలంలో..

యాదమరి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): యాదమరి మండల పరిధిలోని సరిహద్దు గ్రామాల్లో పంట పొలాలపై మళ్లీ ఏనుగుల దాడులు కొనసాగుతున్నాయి. కొంతకాలంగా యాదమరి సరిహద్దుల్లో తిష్టవేసిన గుంపులో 14 ఏనుగులను అటవీశాఖ సిబ్బంది కౌండిన్య అటవీ ప్రాంతానికి మళ్లించారు. అందులో మిగిలిన మూడు ఏనుగులు పంటలపై దాడులు చేస్తూ హడలెత్తిస్తున్నాయని అటవీ సమీప గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. బుధవారం రాత్రి మూడు ఏనుగులు.. రాచూరు బీట్ సిద్ధారెడ్డిపల్లె, ఓటివారిపల్లె, నాగిరెడ్డివూరు, కె.కొత్తూరు సమీపంలోని వరి, అరటి, చెరకు పంటలను ధ్వంసం చేసినట్లు బాధిత రైతులు దామోదరాచారి, రవి తెలిపారు. అలాగే వేణుగోపాల్ నాయుడికి చెందిన వరి, జయచంద్ర నాయుడికి చెందిన వేరుశనగ, మామిడి పంటలను, వెంకటేష్ నాయుడికి చెందిన అరటి, రాగి పంటలను తొక్కి ధ్వంసం చేయడంతో తీవ్రంగా నష్టపోయామని వాపోయారు. ధ్వంసమైన పంటలను డీఆర్వో ఆనందరెడ్డి, ఎఫ్ఎస్‌వో మోహన మురళి, సిబ్బంది పరిశీలించారు.

కత్తి, ఇనుప రాడ్‌తో దాడి చేసి..

26 గ్రాముల బంగారం, రూ.3.91 లక్షల దోపిడి

యాదమరి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కత్తి, ఇనుప రాడ్‌తో ఓ వ్యక్తిపై దాడిచేసి.. 26 గ్రాముల బంగారం, రూ.3.91లక్షలను దోపిడీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. యాదమరి మండల పరిధిలోని కాణిపాకం ఫ్లైఓవర్, చిత్తూరు - తిరుపతి హైవే గాండ్లకొత్తూరు వద్ద అరోమా హోటల్ ఉంది. దీని వెనుకవైపున హోటల్ యజమాని రమేష్ ఒంటరిగా నివాసం ఉంటున్నారు. ఇతనికి మధుమేహం కారణంగా ఓ కాలు సగం వరకు తొలగించి ఉన్నారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి పది గంటల సమయంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తలుపు గడియ తొలగించి లోనికి ప్రవేశించారు. బెడ్‌రూమ్‌లోకి చొరబడి రమేష్‌పై దాడి చేసి గాయపరిచారు. అనంతరం రూ.3,91,000, 26 గ్రాముల బంగారం (20 గ్రాముల చైను, 6 గ్రాముల ఉంగరం) దోచుకెళ్లారు. కొంతసేపటికి హోటల్‌ను లీజుకు తీసుకున్నవారికి విషయం తెలియడంతో వారు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చి, బాధితుడిని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గురువారం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

స్థానికులపైనే అనుమానం?

ఈ దోపిడీ జరగడానికి గంట ముందు స్థానికుడు ఒకరు వడ్డీ డబ్బులను రమేష్ ఇచ్చి వెళ్లినట్లు సమాచారం. ఆ తర్వాత చోరీ జరిగిన తీరును చూస్తుంటే స్థానికులపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, ఆదిశగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

గురుకుల పాఠశాల, జూనియర్ కాలేజీల ప్రవేశాలకు నేడు పరీక్షలు

హాజరుకానున్న 1,838 మంది అభ్యర్థులు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలల్లో ప్రవేశానికి శుక్రవారం పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఆర్వో మోహన్‌కుమార్ తెలిపారు. గురువారం తన చాంబర్‌లో పరీక్షల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, జూనియర్ కాలేజి ప్రవేశ పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరుగుతాయన్నారు. పరీక్ష కేంద్రాలుగా.. చిత్తూరులో విజయం డిగ్రీ కళాశాల, నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్, కేశవరెడ్డి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, క్యాంఫర్డ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లను గుర్తించామన్నారు. 756 మంది విద్యార్థులు హాజరవుతారని చెప్పారు. మధ్యాహ్నం జరిగే జూనియర్ కళాశాల ప్రవేశ పరీక్షలకు విజయం డిగ్రీ కళాశాల, నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్, కేశవరెడ్డి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, క్యాంఫర్డ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, గిరింపేట మున్సిపల్ హైస్కూల్‌లను పరీక్ష కేంద్రాలుగా గుర్తించామన్నారు. వీటిల్లో 1,082 మంది అభ్యర్థులు హాజరవుతున్నట్లు తెలిపారు. డీఈవో వరలక్ష్మి, జిల్లా కాలేజ్ కోఆర్డినేటర్ భార్గవి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీఎం గారూ.. నా మెడికల్ బిల్లులు ఇప్పించండి!

కేన్సర్‌తో పోరాడుతున్నానంటూ విశ్రాంత డీసీటీవో ఆవేదన



రమ్యమణి

నగరి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): 'సీఎం గారూ కేన్సర్‌తో పోరాడుతున్నాను. దయచేసి నాకు ప్రభుత్వం నుంచి రావలసిన బిల్లులు ఇప్పించి న్యాయం చేయండి' అని నాగలాపురంలో డీసీటీవోగా పనిచేసి రిటైరైన రమ్యమణి వేడుకున్నారు. గురువారం తన ఇంట్లో మీడియా ఎదుట తన ఆవేదన వ్యక్తం చేశారు. డీసీటీవోగా పనిచేస్తూ తాను 2017 మే 31న పదవీ విరమణ పొందినా తనకు రావాల్సిన మెడికల్ బిల్లులు రూ.2,65,299 ఇప్పటికీ అందలేదని తెలిపారు. తనకు ఇప్పటి వరకు కేవలం 75శాతం పెన్షన్ మాత్రమే అందుతోందన్నారు. పూర్తి పెన్షన్, రావాల్సిన బకాయిలను ఇప్పించి న్యాయం చేయాలని సీఎం చంద్రబాబును వేడుకుంటున్నానని తన ఆవేదన వ్యక్తం చేశారు. మే 11, 2017న ఏసీబీ వారు తాను పనిచేస్తున్న చెక్‌పోస్టులో రైడింగ్ చేసి, తాను విధి నిర్వహణలో లేనట్లు మెమో జారీచేసి కేసు పెట్టారని, అయితే తాను మెడికల్ లీవులో ఉన్నానని, ఆ మేరకు డాక్టర్ సర్టిఫికెట్ సమర్పించినా పట్టించుకోవడం లేదన్నారు.

కానిస్టేబుల్ లక్ష్మికి పోలీస్ లాంఛనాలతో అంత్యక్రియలు



చౌడేపల్లె, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్న మహిళా కానిస్టేబుల్ లక్ష్మికి పోలీస్ లాంఛనాలతో గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. బుధవారం రాత్రి ఉరేసుకుని మృతి చెందిన లక్ష్మికి స్థానిక ఎస్ఐ నాగేశ్వరరావు, చిత్తూరు పోలీసుల ఆధ్వర్యంలో అంత్యక్రియలు చేపట్టారు. అలాగే ఆమె కుటుంబ సభ్యులకు ఎస్పీ మణికంఠ.. రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. ఆమె భర్తకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

క్రీడా దుస్తుల వితరణ



క్రీడాకారులతో బీసీఎన్ తదితరులు

కుప్పం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): అంతర్ జిల్లా సబ్ జూనియర్ షూటింగ్ బాల్ పోటీలలో పాల్గొనే క్రీడాకారులకు గురువారం బీసీఎన్ చారిటబుల్ ట్రస్ట్ నుంచి బీసీఎన్ విద్యా సంస్థల అధినేత బీసీ.నాగరాజ్, వైస్ చైర్మన్ డాక్టర్ సునీల్‌రాజ్ రూ.30 వేలు విలువైన క్రీడా దుస్తులను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించాలన్న సంకల్పంతో ఏటా క్రీడా దుస్తులు, క్రీడా పరికరాలు వితరణ చేస్తున్నట్లు చెప్పారు. చిత్తూరు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ చైర్మన్ మహేశ్ మాట్లాడుతూ క్రీడల అభ్యున్నతికి సహకరిస్తున్న బీసీఎన్ విద్యా సంస్థల యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కుప్పం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ భాస్కర్, శరవణన్, పీఆర్వో ప్రవీణ్ కుమార్, పీఈటీ వేణు, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ గంగాధర్, లియో క్లబ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరులో ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలి



సీఐ సుబ్బరాయుడికి వినతిపత్రం అందజేస్తున్న సుకుమార్‌బాబు

పుంగనూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు పరిధిలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు చొరవ చూపాలని సీఐ సుబ్బరాయుడుకు విశ్రాంత డీఎస్పీ కె.సుకుమార్‌బాబు వినతి పత్రం అందజేశారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లోని నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐతో విశ్రాంత డీఎస్పీ, పట్టణ ప్రముఖులు మాట్లాడుతూ పట్టణంలో రోడ్డు వెడల్పుగా ఉన్నప్పటికీ దుకాణదారులు డ్రైనేజీ కాల్వపైకి రావడంతో ద్విచక్రవాహనదారులు రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలుపుతున్నారని.. రోడ్డు వెడల్పు తగ్గి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారుతోందన్నారు. అలాగే తోపుడు బండ్లు ఎక్కడ పడితే అక్కడ రోడ్డుపై ఏర్పాటు చేసుకోవడంతో వాహనాలు నడపడానికి ఇబ్బందులు తప్పడం లేదని వాపోయారు. కాల్వలపైకి దుకాణాదారులు రాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పిల్లలు ద్విచక్రవాహనాలు నడపడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ట్రాఫిక్ నిబంధనలు, జరిమానాలు గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలని వివరించారు. కార్యక్రమంలో విశ్రాంత ఎస్ఐ సత్యానారాయణ, నాయకులు దేశాది శ్రీనివాసులు, ఆర్యవైశ్య సంఘనాయకుడు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా హరగోపాల్ నాయక్



బాధ్యతలు తీసుకుంటున్న హరగోపాల్‌నాయక్

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ హరగోపాల్‌నాయక్ గురువారం బాధ్యతలు తీసుకున్నారు. స్థానిక ఆసుపత్రిలో జనరల్ సర్జన్‌గా పని చేస్తున్న హరగోపాల్ నాయక్ సీనియర్ డాక్టర్ కావడంతో వైద్యఆరోగ్యశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు మెడికల్ సూపరింటెండెంట్‌గా వ్యవహరిస్తున్న చిన్నపిల్లల డాక్టర్ మధుసూదనాచారి ఆయనకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉంటామని తెలిపారు.

వైభవంగా గంగమాంబ ఆలయ కుంభాభిషేకం



ఆలయంలో గోపూజ నిర్వహిస్తున్న వేదపండితులు

వి.కోట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వి.కోట మండలం గుమ్మిరెడ్డిపల్లె గ్రామంలో వెలసిన పెద్దపులి గంగమాంబ ఆలయంలో మహా కుంభాభిషేకం గురువారం అ త్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి ఆలయాన్ని పురుషోత్తం చౌదరి కుటుంబ సభ్యులు నూతనంగా పనులు చేపట్టి నిర్మించారు. తెల్లవారు జామున అమ్మవారి విగ్రహాన్ని గర్భాలయంలో ప్రాణపతిష్ఠ చేశారు. జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ, ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్రనాయుడు, మండల టీడీపీ అధ్యక్షులు రంగనాథ్, ఎంపీపీ యువరాజ్, నాయకులు పాల్గొన్నారు.

పలమనేరు విద్యార్థినికి రేవా యూనివర్సిటీ పురస్కారం



పలమనేరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులోని ప్రముఖ రేవా యూనివర్సిటీ ఏటా ప్రతిష్టాత్మకంగా అందజేసే బెస్ట్ అవుట్ గోయింగ్ స్టూడెంట్ అవార్డును పలమనేరు విద్యార్థిని పి. యశశ్విత అందుకున్నారు. యశశ్విని ఎంటెక్‌లో 97 శాతం మార్కులు సాధించడంతో రెండు ప్రముఖ కంపెనీలు ఉద్యోగానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ



విద్యాసామగ్రిని అందిస్తున్న భజన మండలి సభ్యులు

చౌడేపల్లె, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి భజన మండలి సభ్యురాలు సుజాత ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. అనంతరం సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నందివాహనంపై శివపార్వతుల విహారం



పురవీధుల్లో త్రిశూలం ఊరేగింపు

సోమల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సోమల పట్టణంలో కొలువుదీరిన స్వయంభేశ్వర స్వామి ఆలయంలో గురువారం వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా శివపార్వతులను నందివాహనంపై ఊరేగించారు. చిన్నయ్యగారివీధికి చెందిన ఉభయ దారుల ఆధ్వర్యంలో ఆలయంలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అలాగే ఆలయంలో నూతనంగా నిర్మించిన దక్షణామూర్తి విగ్రహ ప్రతిష్ఠాపణ కార్యక్రమం గుంతచెరువుపల్లె చెల్లే శంకరయ్య కుటుంబ సభ్యులచే చేపట్టారు.

2 నుంచి అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

చౌడేపల్లె, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక బజారువీధిలో వెలసిన అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో వచ్చే నెల 2 నుంచి స్వామి వారి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధానార్చకులు డాక్టర్ రాజశేఖర్ దీక్షితులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మే 2న అంకురార్పణ, 3న ధ్వజారోహణం, 4న యాళివాహనం, 5న శేషవాహనం, 6న రావణ బ్రహ్మవాహనం, 7న నంది వాహనాలు, 8న కల్యాణోత్సవం, గజవాహనం, 9న రథోత్సవం, 10న అశ్వవాహనం, 11న హంస వాహనం, ధ్వజావరోహణం, 12న ప్రథమ శయనోత్సవం, 13న ద్వితీయ శయనోత్సవం, 14న ఉయ్యాలోత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. భక్తులు స్వామివారి బ్రహ్మోత్సవాలలో పాల్గొనాలని కోరారు.

శాస్త్రోక్తంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

సోమల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం నగిరిండ్లు సీతారామాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం గురువారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో గణపతి పూజ, గోపూజ, కలశస్థాపన, గణపతి హోమం చేపట్టారు. రాత్రి సీతారామ ఉత్సవమూర్తులను పల్లకిలో ఊరేగించారు. ఆలయ ధర్మకర్త కుటుంబ సభ్యులు వెంకటరమణ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

నేడు కుప్పం గంగజాతర ఏర్పాట్లపై సమావేశం

కుప్పం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో వెలసిన ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతర మహోత్సవాలపై శుక్రవారం ఉదయం 10 గంటలకు గంగమాంబ ఆలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు గంగ జాతర ఉత్సవ కమిటీ చైర్మన్ బీఎంకే. రవిచంద్రబాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఈవో, దేవస్థానం పూజారులు, ఉత్సవ కమిటీ సభ్యులు హాజరై జాతర నిర్వహణపై సూచనలు, సలహాలు ఇవ్వాలని ఆయన కోరారు.

2 నుంచి నిత్యపారాయణ శ్లోకాల వేసవి తరగతులు

పుంగనూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 2 నుంచి 21 రోజుల పాటు పుంగనూరు నగరివీధిలో పిల్లలకు ఉచిత నిత్యపారాయణ శ్లోకాలు నేర్పించడానికి వేసవి శిక్షణ తరగతులు జరుగుతాయని నిర్వాహకులు స్కాలర్ శ్రీధర్‌శర్మ (కంచిస్వామి) గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రోజూ ఉదయం 7.30 గంటల నుంచి 9 గంటల వరకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తిగల పిల్లల పేర్లను ఈనెల 30 లోపు ఫోన్‌నంబర్ 9966982620 ను సంప్రదించి నమోదు చేసుకోవాలని కోరారు.

హజ్ కమిటీ చైర్మన్‌ను కలిసిన నాయకులు



పుంగనూరు రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ హాజీ జనాబ్ జిల్ఫికల్ అహ్మద్‌ఖాన్‌ను మర్యాదపూర్వకంగా ఏపీ హజ్ కమిటీ సభ్యులు పఠాన్‌ఖాదర్‌ఖాన్‌తో పాటు పుంగనూరు టీడీపీ మైనార్టీ నాయకులు కలిశారు. గురువారం బెంగళూరులో ఆయనను కలిసి పవిత్ర హజ్‌యాత్రకు వెళుతున్న 1630 మందికి సదుపాయాలు కల్పించాలని కోరారు.

హౌసింగ్ ఏఈగా శ్రీరాములు

పెద్దపంజాణి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పెద్దపంజాణి మండల ఇన్‌చార్జి హౌసింగ్ ఇంజనీర్‌గా శ్రీరాములును నియమిస్తూ గురువారం జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారని ఎంపీడీవో బాలాజీ తెలిపారు. మండలంలోని శంకర్రాయలపేట ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న శ్రీరాములను ఇన్‌చార్జి ఏఈగా నియమించారని పేర్కొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

పలమనేరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణికులకు మెరుగైన సేవలను అందించే కార్యక్రమంలో భాగంగా ఈనెల 24న డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ టీకే స్వామి తెలిపారు. శుక్రవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ప్రయాణికులు తమ సమస్యలను ఫోన్ నంబర్ 9959225678 కు తెలియజేయాలని కోరారు.

చలువ పందిళ్ల ఏర్పాటుకు టెండర్ల ఆహ్వానం

పలమనేరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పలమనేరులో ఈనెల 30 నుంచి మే 17వ తేదీ వరకు జరిగే తిరుపతి గంగమ్మ జాతర సందర్భంగా చలువ పందిళ్లు, విద్యుద్దీకరణ, పూల సరఫరా కోసం గుత్తేదారుల నుంచి టెండర్లు కోరుతున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి కమలాకరరావు తెలిపారు. గుత్తేదారులలో తక్కువ టెండర్లు వేసిన వారికి కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలు అప్పగించనున్నట్లు పేర్కొన్నారు.

చౌడేపల్లె వైసీపీ మండలాధ్యక్షుడిగా నాగభూషణరెడ్డి



చౌడేపల్లె, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): చౌడేపల్లె వైసీపీ మండలాధ్యక్షులుగా ఎద్దకొండమారికి చెందిన నాగభూషణరెడ్డిని ఎంపిక చేసినట్లు ఆయన పేర్కొన్నారు. వైసీపీ పటిష్ఠతకు తాను కృషి చేస్తానని ఆయన తెలిపారు.

టమోటా మొలకలు ఇప్పిస్తానంటూ మోసం

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): అధిక దిగుబడి వస్తుందంటూ యూట్యూబ్‌లో వచ్చిన ప్రకటన చూసి మోసపోయానంటూ ఓ రైతు పోలీసులకు ఫిర్యాదు చేసిన సంఘటన పుంగనూరులో గురువారం వెలుగు చూసింది. బాధితుని కథనం మేరకు.. పుంగనూరు మండలం పాళ్యంపల్లె పంచాయతీ పెద్దగడిదేశికి చెందిన శ్రీరాములురెడ్డి కుమారుడు శంకర్‌రెడ్డి 10 రోజుల క్రితం యూట్యూబ్ చూస్తుండగా టమోటా పంట దిగుబడికి నూతన వంగడాలను అందిస్తున్నట్లు ప్రకటన చూశాడు. అందులోని ఫోన్‌నంబర్ 82916292747 కు ఫోన్ చేసి విచారించి మొలకలకు నగదు చెల్లిస్తే వెంటనే పంపుతామని రైతు శంకర్‌రెడ్డిని నమ్మించారు. రైతు వెంటనే రూ. 17 వేలు నగదు చెల్లించాడు. అయితే వారం రోజులుగా ఫోన్ చేస్తే ఫలితం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బంగారు గొలుసు చోరీ

పలమనేరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ఆర్టీసీ బస్టాండులో శిరీష అనే మహిళకు చెందిన రూ.లక్షకు పైగా విలువ చేసే బంగారు గొలుసు చోరీకి గురైంది. చౌడేపల్లి మండలం కొండామర్రి గ్రామానికి చెందిన శిరీష బెంగళూరు నుంచి బస్సులో దిగి పలమనేరు ఆర్టీసీ బస్టాండులో చౌడేపల్లి వెళ్లేందుకు బస్సు ఎక్కింది. బస్సు ఎక్కిన కొద్ది సేపటికే ఆమె సమీపంలో కూర్చొన్న ఓ మహిళ తన వద్ద ఉన్న నగదు ఎవరో చోరీ చేశారని బస్సుదిగి వెళ్లిపోయింది. ఈక్రమంలోనే తన గొలుసు చోరీకి గురైందని గుర్తించి పలమనేరు పోలీసులకు సమాచారం ఇచ్చింది. పోలీసులు చేరుకుని తనిఖీలు చేపట్టారు.

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు



శాంతిపురం: మాట్లాడుతున్న టీడీపీ మండలాధ్యక్షులు భాష్యం విశ్వనాథనాయుడు



వి.కోట: నూతనంగా ఎంపికైన బాలసుందరాన్ని సన్మానిస్తున్న నేతలు

శాంతిపురం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సంస్థాగత ఎన్నికల్లో పదవులు పొందిన ప్రతి ఒక్కరూ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని .. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని టీడీపీ మండలాధ్యక్షులు భాష్యం విశ్వనాథనాయుడు, మాజీ ఎంపీపీ నందిగం ఉదయకుమార్ నాయుడు అన్నారు. గురువారం తుమ్మిశి, నడింపల్లె, చిన్నారిదొడ్డి, మొరసనపల్లె, అనికెర, రేగడదిన్నేపల్లె, కెనమాకులపల్లె గ్రామ పంచాయతీ టీడీపీ సంస్థాగత ఎన్నికలు జరిగాయి. కుప్పం మండల మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేష్, టీడీపీ సీనియర్ నేత కన్నన్‌లు ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. తుమ్మిశి పంచాయతీ పార్టీ అధ్యక్షులు బి.కె.మంజునాథ్, ప్రధాన కార్యదర్శిగా బాలసుబ్రహ్మణ్యం, మొరసనపల్లె సోమశేఖర్, శంకరప్ప, అనెకర పంచాయతీ మునిరత్నం, ఆంజీ, రేగడదిన్నేపల్లె పంచాయతీకి శ్రీనివాసులు, నాగరాజు, అనికెర, కెనమాకులపల్లె యూనిట్ ఇన్‌చార్జిలుగా రమేష్‌రెడ్డి, జయారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నడింపల్లె, చిన్నారిదొడ్డి, కెనమాకులపల్లె పంచాయతీ పార్టీ అధ్యక్ష పదవులకు తీవ్ర పోటీ నెలకొనడంతో వాయిదా వేశారు. అనంతరం ఉదయకుమార్ నాయుడు మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పీవీ నాగరాజు, రాళ్లబూదుగూరు క్లస్టర్ ఇన్‌చార్జి చంద్రశేఖర్, యూనిట్ ఇన్‌చార్జిలు ఆర్ఎస్ మణి, ఏఎంసీ నాగరాజు, టీడీపీ సీనియర్ నేతలు చలపతిస్వామి, నారాయణరెడ్డి, రమేష్, మురుగేష్, గోవిందరాజులు, శేఖర్, నాగరాజు,



బైరెడ్డిపల్లె మండలం నెల్లిపట్లలో...

మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు శ్యామల, ప్రధాన కార్యదర్శి రూప, హేమవతి తదితరులు పాల్గొన్నారు.

● బైరెడ్డిపల్లె: మండలంలోని చప్పిడిపల్లె, నెల్లిపట్ల, ధర్మపురి పంచాయతీల్లో టీడీపీ సంస్థాగత ఎన్నికలు గురువారం ఏకగ్రీవంగా జరిగాయి. టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడ, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యంశెట్టి ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికల్లో చప్పిడిపల్లె పంచాయతీ అధ్యక్షుడిగా సురేష్, ప్రధాన కార్యదర్శిగా జయశంకర్, నెల్లిపట్ల పంచాయతీ అధ్యక్షుడిగా చెన్నకేశవులు, ప్రధాన కార్యదర్శిగా మునస్వామి, ధర్మపురి పంచాయతీ అధ్యక్షుడిగా వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా నాగరాజు ఎన్నికయ్యారు. వీరిని టీడీపీ నాయకులు అభినందించారు.

● వి.కోట: తెలుగుదేశం పార్టీలో కష్టపడే ప్రతిఒక్కరికీ గుర్తింపు ఉంటుందని మండల పార్టీ అధ్యక్షులు రంగనాథ్ అన్నారు. పార్టీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా మండల పరిధిలోని గోనుమాకులపల్లె, కృష్ణాపురం, తోటకనుమ, జవ్వునిపల్లె, నెర్నపల్లె, కుంబార్లపల్లె పంచాయతీలో ఏకగ్రీవంగా నూతన కమిటీలను ఎంపిక చేశారు. గోనుమాకులపల్లె పంచాయతీ పార్టీ అధ్యక్షులుగా నేతాజీ, ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్‌కుమార్, కృష్ణాపురం అధ్యక్షులుగా శ్రీరామ్‌రెడ్డి, కార్యదర్శిగా మంజునాథ్, తోటకనుమ అధ్యక్షులుగా బాలసుందరం, కార్యదర్శిగా సుబ్రహ్మణ్యం, జవ్వునిపల్లె అధ్యక్షులుగా చంద్రారెడ్డి, కార్యదర్శిగా సుబ్రహ్మణ్యంరెడ్డి, నెర్నపల్లె అధ్యక్షులుగా రమేష్, కార్యదర్శిగా అమరనాథ్, కుంబార్లపల్లె అధ్యక్షులుగా కుమార్, కార్యదర్శిగా రాజ్‌కుమార్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, నేతలు రాంబాబు, ధీరజ్, శబరీష్, హరినాథరెడ్డి, విశ్వనాథరెడ్డి, సతీష్‌నాయుడు, కేశవరెడ్డి, నాసీర్, దామోదరం తదితరులు ఉన్నారు.

అందరి సహకారంతోనే గ్రామాల అభివృద్ధి



పుంగనూరులో అంబేడ్కర్, మహాత్మాగాంధీలకు నివాళులర్పిస్తున్న అధికారులు, నాయకులు



కల్లూరులో నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో రాజశేఖర్‌బాబు, సిబ్బంది

కల్లూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): అందరి సహకారంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని.. అభివృద్ధి సంక్షేమ ఫలాలు ప్రతిఒక్కరికీ అందించడమే పంచాయతీరాజ్ సంస్థల ముఖ్య ఉద్దేశమని ఇన్‌చార్జి ఎంపీడీవో రాజశేఖర్‌బాబు తెలిపారు. పులిచెర్ల మండలంలోని అన్ని పంచాయతీల్లో గురువారం జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయంలో మహాత్మాగాంధీ, రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారి మునిరాజు, ఏపీవో సౌభాగ్యవతి, జేఈ కృష్ణయ్య, టీఏలు జ్యోతిరెడ్డి, సుభాషిణి, కీర్తి, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

● రొంపిచెర్ల: గ్రామాల్లో తాగునీటి సమస్యలకు సత్వర చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి సూచించారు. గురువారం పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా రొంపిచెర్ల, బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ కార్యాలయాల్లో గ్రామసభలు నిర్వహించారు. పంచాయతీ ఈవో సత్యంరెడ్డి, కార్యదర్శులు హరిబాబు, దశరథ శేఖర్‌రెడ్డి, గోవర్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

● పుంగనూరు రూరల్ : జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పుంగనూరులో ఘనంగా నిర్వహించారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మా గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ మండల అధ్యక్షుడు జి.మాధవరెడ్డి, ఏవో రెడ్డెమ్మ, సిబ్బంది సతీష్, బాలాజీ, నాయకులు చైతన్యరాయల్, ప్రసాద్ స్వామి, రాంబాబు, హరి, వేణు పాల్గొన్నారు.

● పెద్దపంజాణి: గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో బాలాజీ తెలిపారు. గురువారం పెద్దపంజాణిలో పంచాయతీరాజ్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈవో ఆర్డీ శారదాదేవి, ఏపీఎం మీరాభాయి, సిబ్బంది పాల్గొన్నారు.

కుప్పంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ దాడులు



సీజ్ చేసిన మందులతో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కీర్తన

కుప్పం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కుప్పంలోని మందుల దుకాణాలపై డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కీర్తన గురువారం అకస్మాత్తుగా దాడులు చేశారు. మందుల రికార్డులను పరిశీలించారు. ప్యాలెస్ రోడ్డులోని ఏఆర్ హాస్పిటల్‌లో లైసెన్సు లేకుండా నడుపుతున్న మందుల దుకాణంలో రూ.2.5 లక్ష విలువ కలిగిన మందులు స్వాధీనం చేసుకున్నారు. దుకాణం నడుపుతున్న అరుణ్‌ఆనంద్‌పై కేసు నమోదు చేసినట్లు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

నూతన భవనాల్లోకి విద్యుత్ అధికారులు

పుంగనూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పుంగనూరులోని చౌడేపల్లె రోడ్డు సబ్‌స్టేషన్ వద్ద నూతనంగా నిర్మించిన భవనాల్లోకి ఏపీ ఎస్పీడీసీఎల్ కార్యకలాపాలు నిర్వహించేలా విద్యుత్ కార్యాలయాలను తరలించినట్లు డీఈఈ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ పుంగనూరు డీఈఈ, ఏడీఈ, ఈఆర్వో, పట్టణ పరిధిలోని టౌన్, ఈస్టు, రూరల్ ఏఈ కార్యాలయాలన్నీ మినీ బైపాస్ రోడ్డులోని అద్దె భవనం నుంచి నూతన సొంత భవనాల్లోకి మార్చడం జరిగిందని వివరించారు. విద్యుత్ బిల్లుల చెల్లింపు, కరెంట్‌కు సంబంధించిన సమస్యలపై వినియోగదారులు కొత్త భవనాల్లోని కార్యాలయాల్లో అధికారులను సంప్రదించాలని ఆయన కోరారు.

రైతులకు సబ్సిడీపై కవర్లు అందించాలి

రొంపిచెర్ల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మామిడి కాయలకు పురుగులు ఆశించకుండా రక్షణ కోసం ఉపయోగించే పండ్ల కవర్లను ఉద్యానశాఖ ఆధ్వర్యంలో 50 శాతం రాయితీ పై రైతులకు అందించాలని రైతులు కోరుతున్నారు. మామిడిలో పండ్ల కవర్లు వాడటంతో నాణ్యమైన దిగుబడులు రావడంతో పాటు తామరపురుగు, తేనెమంచు పురుగు, పండు ఈగ నుంచి రక్షణ ఉంటుందన్నారు. అలాగే అధిక ఎండ, వడగండ్లవాన నుంచి కాపాడుకోవచ్చని రైతులు తెలిపారు. ఉద్యానశాఖ అధికారులు కవర్లు లేవని తెలపడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. అధికారులు స్పందించి రైతులకు కవర్లను అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చోరీ కేసులో ఇద్దరికి రిమాండ్

చిత్తూరు లీగల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టు ఆవరణలో శానిటేషన్‌కు సంబంధించిన పైపులను చోరీ చేసిన ఇద్దరు నిందితులను న్యాయస్థానం రిమాండ్‌కి తరలించింది. జిల్లా కోర్టు ఆవరణ పరిధిలో శానిటేషన్‌కు సంబంధించిన పైపులను గంగాధరనెల్లూరు మండలం బాలగంగనపల్లి గ్రామానికి చెందిన సురేష్, చిత్తూరు రూరల్ మండలం పచ్చనపల్లికి చెందిన లెనిన్‌కుమార్‌లు చోరీకి పాల్పడ్డారు. చిత్తూరు వన్‌టౌన్ సీఐ మహేశ్వర్ కేసు నమోదుచేసి గురువారం కోర్టుకు తరలించారు.

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి



పుంగనూరులో మౌనదీక్ష...



పలమనేరులో ...



కుప్పంలో నివాళులర్పిస్తున్న జనసైనికులు

సోమల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్‌లోని యాత్రికులపై దాడి చేసి చంపిన పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని పుంగనూరు బీజేపీ ఇన్‌చార్జి గన్నా మదన్‌మోహన్‌బాబు డిమాండ్ చేశారు. గురువారం పెద్దఉప్పరపల్లెలో బీజేపీ మండలాధ్యక్షుడు హేమగిరి ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతి నాయుడు, బాలాజీ నాయుడు, రెడ్డెప్పనాయుడు, రమణ తదితరులు పాల్గొన్నారు.

● కుప్పం : జమ్ముకశ్మీర్ పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన నెల్లూరు జిల్లా కావలికి చెందిన జనసేన కార్యకర్త మధుసూదన్‌రావు స్మృతికి కుప్పంలో జనసైనికులు గురువారం నివాళులర్పించారు. కుప్పం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు సర్కిల్‌లో మధుసూదన్‌రావు చిత్రపటానికి పూలమాలలు వేసి వందనం చేశారు. జనసేన కుప్పం నియోజకవర్గ ఇన్‌చార్జి నరేశ్, జన సైనికులు, పట్టణ ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.

● పలమనేరు: ఉగ్రవాదుల దాడిలోని మృతులకు గురువారం రాత్రి పలమనేరులో ఘనంగా నివాళులు అర్పించారు. పలమనేరు వాసవి క్లబ్ వనిత సభ్యులు బజారు వీధిలోని ఏటీఎం సెంటర్‌లో నివాళులు అర్పించారు. పలమనేరు రిక్రియేషన్ క్లబ్ ఆవరణలోనూ క్లబ్ సభ్యులు ర్యాలీ చేపట్టారు.

● చౌడేపల్లె: జమ్ముకశ్మీర్ ఉగ్రదాడిలోని మృతులకు జనసేన నాయకులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి గురువారం రాత్రి నివాళులు అర్పించారు. నాయకులు జీవన్‌ప్రకాష్, చిన్న, మురళీ, హరిప్రసాద్, సాగర్ ప్రవీణ్, రాజీ పాల్గొన్నారు.

● పుంగనూరు: జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడులను నిరసిస్తూ జనసేన, టీడీపీ నాయకులు పుంగనూరులో మౌనదీక్షలు చేపట్టారు. గురువారం స్థానిక ఇందిరాసర్కిల్‌లో జనసేన, టీడీపీ నాయకులు కలిసి శ్రద్ధాంజలి ఘటించారు.నాయకులు చిన్నారాయల్, పార్థు, చంద్ర, ప్రసాద్, శ్రీనివాసులు, భార్గవ్, వినోద్, నవీన్, బంగార్, సాయి, గోపి, గౌతం, శ్రీను, అనిల్‌కుమార్, లోకేశ్, సునీల్ పాల్గొన్నారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

ఉగ్రదాడికి జనసేన మౌనదీక్ష


కార్వేటినగరంలో ఉగ్రదాడికి నిరసనగా మౌనదీక్ష

వెదురుకుప్పం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పహల్గాంలో జరిగిన ఉగ్ర దాడిని నిరసిస్తూ గురువారం సంతాప సూచకంగా కార్వేటినగరంలోని జనసేన పార్టీ కార్యాలయం వద్ద జనసేన నాయకులు మౌనదీక్ష చేపట్టారు. కార్యక్రమంలో జనసేన జీడీనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి యుగంధర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు. అలాగే వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం కూడలిలో గురువారం రాత్రి కూటమి నాయకులు కొవ్వొత్తులు వెలిగించి నిరసన వ్యక్తం చేశారు.

కొవ్వొత్తుల ర్యాలీ


బంగారుపాళ్యంలో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న యువకులు

బంగారుపాళ్యం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడులను ఖండిస్తూ మండల కేంద్రమైన బంగారుపాళ్యంలో యువకులు గురువారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలన్నారు. బీజేపీ పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌చార్జి బాలు, అనిల్, చంద్రబాబు, విఘ్నేష్‌కుమార్, హరిప్రసాద్‌రెడ్డి, గోపి, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

● పూతలపట్టు: కశ్మీర్‌లో ఉగ్రవాదుల చేతిలో మృతి చెందిన వారి ఆత్మలకు శాంతి కలగాలంటూ పూతలపట్టు మండల బీజేపీ ఆధ్వర్యంలో గురువారం అంబేడ్కర్ సర్కిల్ వద్ద కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మండల బీజేపీ అధ్యక్షుడు ఎం.ప్రసాద్, నాయకులు సోమశేఖర్ చౌదరి, శంకర్ నాయుడు, భాస్కర్, బాలక్రిష్ణ, లావణ్య, టీడీపీ నాయకులు జయప్రకాష్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజారోహణం


ధ్వజస్తంభ పూజలు నిర్వహిస్తున్న అర్చకులు


వెదురుకుప్పం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం చవటగుంట ద్రౌపది సమేత ధర్మరాజుల వారి ఆలయ మహాభారత ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం శాస్త్రోక్తంగా ధ్వజారోహణం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఆలయ శుద్ధి చేశారు. చలువ పందిళ్ల, విద్యుత్ దీపాలంకరణలతో ముస్తాబు చేశారు. అమ్మవారి, పంచ పాండవుల ఉత్సవమూర్తులకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ధ్వజస్తంభానికి పూజలు చేసి, ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించడంతో మహాభారతం ఉత్సవాలు మొదలయ్యాయి. ఈ కార్యక్రమానికి జయప్రసాద్‌రెడ్డి, సౌజన్య, పద్మనాభరెడ్డి, రాజేశ్వరి, డిల్లీప్రసాద్‌రెడ్డి, శ్రీదేవి ఉభయదారులుగా వ్యవహరించారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణారెడ్డి పర్యవేక్షించారు.

ప్రభుత్వ విప్ థామస్‌కి ఆహ్వానం


థామస్‌కి ఆహ్వాన పత్రిక ఇస్తున్న నిర్వాహకులు

వెదురుకుప్పం మండలం చవటగుంట ద్రౌపది సమేత ధర్మరాజుల ఆలయంలో జరుగుతున్న మహాభారతం ఉత్సవాలకు రావాలని ప్రభుత్వ విప్ థామస్‌కి ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణారెడ్డి, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పి.మోహన్‌మురళి, బోడిరెడ్డి సుధాకర్ రెడ్డి, ముఖ్య కార్యనిర్వాహకులు ఆహ్వాన పత్రికను అందించి ఆహ్వానించారు.

సరస కవిచంద్ర అన్నయ్య నాయుడు


అన్నయ్య నాయుడు

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉపాధ్యాయుడు, చందోబద్ధ కవి అన్నయ్య నాయుడిని సరస కవిచంద్ర బిరుదుతో సత్కరించనున్నట్లు హరివిల్లు లలిత కళావేదిక నిర్వాహకులు హరి నాయుడు, భాస్కర్‌రెడ్డి, మునుస్వామి, పత్తిపాటి రమేష్ నాయుడు, గోవిందన్‌లు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. త్వరలో చిత్తూరులో నిర్వహించే కార్యక్రమంలో ఆయనకు బిరుదు ప్రదానం చేసి సత్కరించనున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్యే నివాళి


రాజరాజేశ్వరి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): నగరి మండలంలోని గుండ్రాజకుప్పం పంచాయతీ మాజీ సర్పంచి నల్లరాజు సతీమణి, టీడీపీ నేతలు ఉమాపతిరాజు, లక్ష్మీనారాయణల తల్లి రాజేశ్వరి మృతదేహానికి గురువారం ఎమ్మెల్యే భానుప్రకాష్ పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్ర టీఎన్‌టీయూసీ కార్యదర్శి బాలాజీ, మండల అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి, నాయకులు నారాయణస్వామి నాయుడు, ధనంజయరాజు, బాబు నాయుడు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదికేశవులు నాయుడి వర్ధంతి


ఆదికేశవులు నాయుడి విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న బలిజ సంఘం నాయకులు

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): చిత్తూరు మాజీ ఎంపీ, పారిశ్రామికవేత్త ఆదికేశవులు నాయుడి వర్ధంతిని గురువారం చిత్తూరు బలిజ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. మురకంబట్టు బైపాస్ రోడ్ కూడలిలో ఆయన కాంస్య విగ్రహానికి బలిజ సంఘం ప్రతినిధులు వి.కె.విశ్వనాథ్, ఆరణి తులసిరాం, చలపతి, ఆరణి బాలాజి తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గాంధీ విగ్రహం వద్ద పేదలకు అన్నదానం చేశారు.

సబ్సిడీపై మడక పంపిణీ

విజయపురం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇళ్లత్తూరులో మండల వ్యవసాయాధికారి రజనీకుమారి సబ్సిడీపై మడకను గురువారం పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందించే సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల టీడీపీ నాయకులు మునిభాస్కర్, ఏలుమలై, వరదరాజులు, నాయకులు పాల్గొన్నారు.

గొంతు కోసుకుని వ్యక్తి ఆత్మహత్యాయత్నం

వెదురుకుప్పం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): జీవితం మీద విరక్తి చెంది మనస్తాపంతో ఓ వ్యక్తి గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన కార్వేటినగరంలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. కార్వేటినగరంలోని త్యాగరాజు పిళ్లై వీధికి చెందిన గోపాల్(52) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో బాధ భరించలేక జీవితం మీద విరక్తి చెంది బ్లేడుతో గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. గుర్తించిన స్థానికులు ప్రథమ చికిత్స నిమిత్తం కార్వేటినగరం సీహెచ్‌సీకి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు 108 అంబులెన్స్‌లో తరలించారు. ఈ విషయమై పోలీసులకు సమాచారం అందలేదు.

అదుపుతప్పి ద్విచక్ర వాహనం బోల్తా

- ఇద్దరికి గాయాలు


గాయపడ్డ వంశీ, అరుణ్

బంగారుపాళ్యం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): అదుపు తప్పి ద్విచక్ర వాహనం బోల్తాపడిన సంఘటనలో ఇద్దరు యువకులు గాయపడ్డ సంఘటన గురువారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. వివరాలిలా ఉంది. కీరమంద పంచాయతీ గౌరీనారాయణపురం గ్రామానికి చెందిన వంశీ, అరుణ్‌లు తమ ద్విచక్ర వాహనంలో పలమనేరు వెళ్లి తిరిగి గ్రామానికి వస్తుండగా, మార్గ మధ్యంలోని మొగిలి శివపరమాత్మ ఆశ్రమం ఎదుట ద్విచక్ర వాహనం బోల్తాపడింది. ఈ సంఘటనలో వంశీ, అరుణ్‌లకు తీవ్ర గాయాలు కావడంతో 108 ద్వారా బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రికి తరలించి, మెరుగైన వైద్య నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీటి కోసం ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ

● పలువురికి గాయాలు

బంగారుపాళ్యం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): తాగునీటి కోసం ఇరు కుటుంబాలు ఘర్షణ పడి ఆస్పత్రి పాలైన సంఘటన మండలంలోని ఎద్దులవారిపల్లె హరిజనవాడలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాల మేరకు... ఎద్దులవారిపల్లె హరిజనవాడకు చెందిన గోవిందస్వామి కుమారుడు రంజిత్ కుమార్ తమ ఇంటికి రెండు రోజుల నుంచి పంచాయతీ నీరు రాలేదని బుధవారం సాయంత్రం పంచాయతీ అధికారులు ఏర్పాటు చేసిన గేట్ వాల్‌ను తిప్పాడు. అదే గ్రామానికి చెందిన శ్రావణ్‌కుమార్ పంచాయతీ గేట్‌వాల్ ఎందుకు తిప్పావని రంజిత్‌ను ప్రశ్నించాడు. దీంతో వీరి మధ్య మాటామాట పెరిగి ఘర్షణకి దారి తీసింది. ఈ క్రమంలో గురువారం ఉదయం గోవింద్‌స్వామి కుటుంబానికి, శ్రావణ్‌కుమార్ కుటుంబానికి మళ్లీ గొడవలు జరిగాయి. దీంతో ఒకరిపై ఒకరు దాడులు చేసుకుని గాయాలపాలయ్యారు. గాయపడ్డ వీరిని బంధువులు చికిత్స నిమిత్తం బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

నేడు ఎమ్మెల్యే కార్యాలయాల్లో ప్రజాదర్బార్

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కార్యాలయాల్లో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించనున్నట్లు చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు గురువారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. స్థానిక లక్ష్మీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ కార్యాలయంలో 'ప్రజా ఫిర్యాదుల స్వీకరణ' కార్యక్రమాన్ని ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహిస్తారు.

● పూతలపట్టు నియోజకవర్గ ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ స్థానిక లక్ష్మీనగర్‌కాలనీలోని ఆయన కార్యాలయంలో ఉదయం 11.30 గంటలకు ప్రజాదర్బార్ నిర్వహిస్తారు. ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యేల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చునని పేర్కొన్నారు. ప్రజలు వినతిపత్రంతో పాటు ఆధార్ జిరాక్స్ కార్డు జతచేయాలని ఆ ప్రకటనలో వారు తెలిపారు.

ఆరిమాని గంగమ్మకు ప్రత్యేక పూజలు


విరాళపు చెక్కును అందజేస్తున్న భక్తులు

శ్రీరంగరాజపురం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఎస్‌ఆర్‌పురం మండలం ఆరిమాని గంగమ్మకు గురువారం గంగాధర నెల్లూరు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన చెంగాల్‌రాయన్, రమేష్, ఉష, జస్వంత్ కుటుంబ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అదే విధంగా అమ్మవారికి రూ.10వేలు విరాళాన్ని చెక్కు రూపంలో అందజేశారు. మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు

కేసులు త్వరితగతిన పరిష్కరించండి


గుడిపాల పోలీసుస్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ మణికంఠ

గుడిపాల ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కేసులను త్వరగతిన పరిష్కరించాలని గుడిపాల ఎస్‌ఐ రాంమోహన్‌ను ఎస్పీ మణికంఠ ఆదేశించారు. గురువారం మండలంలోని నరహరిపేట పోలీసుస్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. అనంతరం 190 రామాపురంలో ఉన్న సీఎంసీని తనిఖీ చేసి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. సీఎంసీ పీఆర్వో ప్రిన్స్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నస్వామి నాయుడికి పలువురి నివాళి


చిన్నస్వామి నాయుడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సి.ఆర్.రాజన్ తదితరులు

శ్రీరంగరాజపురం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఎస్‌ఆర్‌పురం మండలం ఒడ్డుపల్లె గ్రామానికి చెందిన రిటైర్డ్ హెడ్ మాస్టర్ కర్ణం చిన్నస్వామి నాయుడు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. గురువారం జిల్లా టీడీపీ అధ్యక్షుడు సి.ఆర్.రాజన్, నాయకులు ఆ గ్రామానికి వెళ్లి ఆయన చిత్రా పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వేమ నాయుడు, శ్రీధర్ యాదవ్, బాలాజీ నాయుడు, దేవ నాయుడు, నాగేశ్వరరావు, జయచంద్ర నాయుడు, తిరుమలేష్, రవి, దాము నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడండి

● సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మోహన్


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మోహన్

ఐరాల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా మండలంలో తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపీపీ మోహన్ అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రస్తుతం రోజురోజుకు ఎండ తీవ్రత పెరుగుతోందన్నారు. 28 పంచాయతీల్లోని గ్రామాల్లో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బంది పడకుండా అధికారులు చూడాలన్నారు. ఉపాధి హామీ పథకంలో తమకు అనుకూలమైన వారికే కాకుండా అర్హులైన వారందరికీ పనులు కల్పించాలన్నారు. దీనిపై ఏపీవో జాహ్నవి మాట్లాడుతూ ఇకపై అలా జరగకుండా చూస్తామన్నారు. అనంతరం గుండ్లపల్లె ఎంపీటీసీ లోకేష్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ఏవో కార్యాలయానికి ఎప్పుడూ తాళం వేసి ఉంటుందని, ఏవో రైతులకు అందుబాటులో ఉండటం లేదని ఆరోపించారు. ఈ విషయంపై ఏవో వరలక్ష్మి మాట్లాడుతూ విధుల్లో భాగంగా రైతు భరోసా కేంద్రాల సందర్శనకు వెళుతుండటం వల్ల కార్యాలయానికి రాలేకపోతున్నానన్నారు. మండలంలో 7029 మందికి ఫార్మర్ రిజిస్ట్రేషన్లు చేసినట్లు తెలిపారు. 294 ఎకరాల్లో 254 మంది రైతులకు బిందు, తుంపర్ల సేద్యం పరికరాలను అందించామన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సుచిత్ర, ఎంపీడీవో ధనలక్ష్మి, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆక్రమణలో కోదండ రామాలయ భూమి


చదును చేసిన కోదండరామస్వామి ఆలయానికి చెందిన భూమి

విజయపురం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని నారపరాజుకండ్రిగలో కోదండ రామస్వామి ఆలయ భూమి ఆక్రమణకు గురవుతుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. శ్రీహరిపురం రెవెన్యూ నారపరాజు కండ్రిగలో సర్వే నెంబరు 397/10లోని 55 సెంట్ల గుంట భూమి ఉంది. కొంతమంది గత వారం రోజులుగా ఈ గుంటను పూడ్చి చదును చేస్తున్నారని, అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. తరతరాలుగా గుడి పేరుతో ఉన్న భూమిని ఇలా ఆక్రమించుకోవడం సరికాదని, ఆలయ భూములను పరిరక్షించాలని కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ కిరణ్‌ను వివరణ కోరగా, తమ దృష్టికి రాలేదని, చర్యలు తీసుకుంటామని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో సత్యసాయి వర్ధంతి

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసాయి బాబా వర్ధంతిని గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో గురువారం భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బాబాకు ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించి, నగరంలో పలు ప్రాంతాల్లో పేదలకు భోజన పొట్లాలు పంపిణీ చేశారు. సాయంత్రం గిరింపేటవీధుల్లో సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో భక్తులు నగర సంకీర్తన నిర్వహించారు. ప్రభాకర్ నాయుడు, గజేంద్రరెడ్డి, పాండురంగం, శేషనారాయణ, శ్రీకంఠయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

గాంధీ కలల సాకారమే గ్రామస్వరాజ్యం


గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు హారతి ఇస్తున్న ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ కలల సాకారమే గ్రామస్వరాజ్యం బలోపేతమని ఎంపీపీ అబ్బూ అనిత, ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి, ఉపాధిహామి క్లస్టర్ ఏపీడీ సుబ్రమణ్యం అన్నారు. పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గంగాధరనెల్లూరు ఎంపీడీవో కార్యాలయంలో గురువారం గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ హరిబాబు, ఏవో లోకేష్, ఉపాధిహామి ఏపీవో శ్రీనివాసులు, వెలుగు ఏపీఎం ఫరీద్‌మస్తాన్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ఈశ్వర్, బుక్కాపట్నం, వేపంజేరి సర్పంచ్‌లు మునిరాజారెడ్డి, వాసుదేవరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు స్వామిదాస్, ఎంపీటీసీ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● పూతలపట్టు: మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో బి.ఆర్.అంబేడ్కర్, మహాత్మాగాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో నాగరాజు, ఈవోపీఆర్డీ శ్రీనివాసులు పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● వెదురుకుప్పం: వెదురుకుప్పం ఎంపీడీవో కార్యాలయంలో గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో పురుషోత్తం, ఏవో నాగరాణి, ఉద్యోగులు పాల్గొన్నారు. గ్రామ సచివాలయాల్లో కూడా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని జరుపుకున్నారు.

● పాలసముద్రం: పాలసముద్రం ఎంపీడీవో కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో విద్యావతి ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈవోపీఆర్డీ రమేష్, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గుడ్ టచ్... బ్యాడ్ టచ్‌లపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ నాగసౌజన్య

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): శక్తియాప్స్, గుడ్ టచ్.. బ్యాడ్ టచ్, మహిళలకు అత్యవసర నెంబర్లపై జిల్లా పోలీసుశాఖ విస్తృతంగా ప్రచారాన్ని నిర్వహిస్తోంది. ఈ క్రమంలోనే గురువారం స్థానిక కొంగారెడ్డిపల్లెలోని సీఆర్‌ఆర్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ నాగసౌజన్య మాట్లాడుతూ ప్రతి మహిళా శక్తియాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే అత్యవసర సమయల్లో రక్షణగా నిలుస్తోందన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై విద్యార్థులకు విపులంగా వివరించారు. బాలల రక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్న విషయాన్ని విద్యార్థులు గుర్తుంచుకోవాలన్నారు. అసహజ స్పర్శలు ఎదురైతే నో చెప్పడంతో పాటు పెద్దలకు చెప్పడంతో పాటు 1098కు కాల్ చేయాలన్నారు. పోలీసు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పదవీ విరమణ సన్మానం


గుణశేఖర్‌ను సన్మానిస్తున్న ఎస్టీయూ నాయకులు

యాదమరి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాచిగుంట పాఠశాల ఉపాధ్యాయుడు గుణశేఖర్ పదవీ విరమణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంటా మోహన్, పీఆర్టీయూ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కనకాచారి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్ రెడ్డిలు ఆయన సేవలను కొనియాడారు. అనంతరం సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు రుక్మిణి, ప్రసాద్, స్థానిక ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి

శ్రీరంగరాజపురం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): రైతులు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ టీ.ప్రసాద్ తెలిపారు. గురువారం మండల సహకార సంఘ కార్యాలయంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈకేవైసీ చేయించుకున్న రైతులకు రూ.3లక్షల వరకు ప్రమాద బీమా, సంవత్సరానికి రూ.25వేల వరకు ఆరోగ్య బీమా, రూ.50వేల వరకు ధ్యానం నష్టపరిహారం సౌకర్యం ఉంటుందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సహకారశాఖ పర్సనల్ ఇన్‌చార్జి రమణ, సీఈవో రాజారెడ్డి, వ్యవసాయాధికారి నర్మద పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలు సంభవించకూడదు

● ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ వీరపాండియన్

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాతాశిశు మరణాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో సుధారాణిని ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ వీరపాండియన్ ఆదేశించారు. గురువారం ఆయన విజయవాడ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ.. ప్రజలందరికీ ఐడీ క్రియేట్ చేయాలన్నారు. ఎన్‌సీడీ సర్వేపై అధికారులు దృష్టి సారించాలన్నారు. జిల్లా టీబీ నివారణ అధికారి వెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ద్రౌపది కల్యాణోత్సవం


ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

బంగారుపాళ్యం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంక్రాంతిపల్లె పంచాయతీ మిట్టపల్లెలో ఉన్న ద్రౌపది, ధర్మరాజుల ఆలయంలో ద్రౌపది కల్యాణోత్సవం గురువారం వైభవంగా జరిగింది. మహాభారత ఘట్టంలో భాగంగా ఐదవ రోజు ద్రౌపదిని పెళ్లి కుమార్తెగా అలంకరించి, చలువ పందిళ్ల క్రింద వేదమంత్రాల నడుమ వైభవంగా ధర్మరాజుకు కల్యాణోత్సవం నిర్వహించారు. పరిసరాల గ్రామస్తులు పాల్గొన్నారు. ఉభయదారులుగా సంక్రాంతిపల్లెకి చెందిన జయంతి, మోహన్‌లు వ్యవహరించారు.

టీడీపీ అధికార ప్రతినిధికి ఆత్మీయ సన్మానం


చినబాబును సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

వెదురుకుప్పం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చిన్నబాబును గురువారం వెదురుకుప్పంలో టీడీపీ శ్రేణులు శాలువ కప్పి ఆత్మీయ సన్మానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పి.మోహన్‌మురళి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు బోడిరెడ్డి హనుమంతరెడ్డి, టీఎన్‌టీయూసీ జీడీనెల్లూరు నియోజకవర్గ అధ్యక్షులు గాలి బాబు నాయుడు, ఎస్సీ సెల్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు బీఎం రవి, భాస్కర్‌రెడ్డి, వరప్రసాద్, రాజ్‌గోపాల్ పాల్గొన్నారు.

రుణవిధానంపై రైతులకు అవగాహన

నగరి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): నగరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రైతులకు రుణ మంజూరు విధానంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. నగరి పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కేవీఆర్ కుమార్ ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు నిర్వహించిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు రుణాలు పొందడానికి ఎలాంటి హామీపత్రాలు ఇవ్వాలి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. బ్రాంచి సూపర్‌వైజర్ శ్రీకాంత్, సీఈవో తులసిపిళ్లై, బ్యాంకు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

● యాదమరి: యాదమరి సహకార సంఘం ద్వారా అందే సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆ శాఖ ఇన్‌చార్జి సులోచన, సీఈవో గుణశేఖర్ ఆధ్వర్యంలో గురువారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఏవో చరిత, సూపర్‌వైజర్ ధనుంజయ రెడ్డి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

● పాలసముద్రం: రైతులు సింగిల్‌విండో సొసైటీలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి డిల్లీప్రసాద్ అన్నారు. పాలసముద్రం సింగిల్‌విండో కార్యాలయంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. డీసీసీబీ సూపర్‌వైజర్ మాబూని, సీఈవో వెంకటముని, రైతులు పాల్గొన్నారు.

చోరీ కేసులో ఇద్దరికి రిమాండ్

చిత్తూరు లీగల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టు ఆవరణలో శానిటేషన్‌కు సంబంధించిన పైపులను చోరీ చేసిన ఇద్దరు నిందితులను న్యాయస్థానం రిమాండ్‌కి తరలించింది. జిల్లా కోర్టు ఆవరణ పరిధిలో శానిటేషన్‌కు సంబంధించిన పైపులను గంగాధరనెల్లూరు మండలం బాలగంగనపల్లి గ్రామానికి చెందిన సురేష్, చిత్తూరు రూరల్ మండలం పచ్చనపల్లికి చెందిన లెనిన్‌కుమార్‌లు చోరీకి పాల్పడ్డారు. వీరిద్దరిపై చిత్తూరు వన్‌టౌన్ సీఐ మహేశ్వర్ కేసు నమోదుచేసి గురువారం కోర్టుకు తరలించారు. న్యాయస్థానం వీరిద్దరిని రిమాండ్‌కు తరలిస్తూ ఆదేశాలు జారీ చేసింది.

ఎంఎల్ పాయింట్ జేసీ తనిఖీ


ఎంఎల్ పాయింట్‌లో అధికారులతో మాట్లాడుతున్న జేసీ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 24 (ఆంధ్ర జ్యోతి): చిత్తూరు - మురకంబట్టు జాతీయ రహదారిపై ఉన్న సివిల్ సప్లయిస్ మండలస్థాయి స్టాక్ పాయింట్లను గురువారం సాయంత్రం జేసీ విద్యాధరి తనిఖీ చేశారు. ఆన్‌లైన్ స్టాక్ రిజిస్టర్‌తో ఎం.ఎల్.పాయింట్‌లో బియ్యం, పంచదార, కందిపప్పు, పామోలిన్ ఆయిల్, మూడు కిలోల బియ్యం బస్తాలు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించారు. ఈనెల 30వ తేదీలోగా మే నెలకు సంబంధించిన నిత్యావసర వస్తువులను అన్ని రేషన్ షాపులకు తరలించాలని ఆదేశించారు. స్థానిక ఆర్టీసీ-2 డిపో రోడ్డులోని 35, 37 నెంబర్ల చౌకదుకాణాలను కూడా ఆమె తనిఖీ చేశారు. డీఎస్వో శంకరన్, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ బాలకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.